
# తరిగొండ నృసింహ శతకము

## మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రణీతము



పరిష్కర్త

ఆచార్య కె.జె. కృష్ణమూర్తి

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

# తరిగొండ నృసింహ శతకము

## మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రణీతము

సాధారణ సంపాదకుడు :

**బి.యస్. రెడ్డి (భూమన్)**

సంచాలకుడు, తి.తి.దే. "శ్వేత", తిరుపతి

పరిష్కర్త : ఆచార్య కె.జె. కృష్ణమూర్తి

తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్ట్

**తి.తి.దే. "శ్వేత" తిరుపతి**

ప్రచురణ

**కార్యనిర్వహణాధికారి**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2007**

TARIGONḌA NṚSIṂHA ŚATAKAMU
MĀTṚŚRĪ TARIGONḌA VEṄGAMĀMBA

Edited by
**Prof. K.J. Krishnamoorthy**
Tarigoṇḍa Veṅgamāmba Vāṅmaya Project
"SVETA", T.T.D., TIRUPATI.

TTD "SVETA" Religious Publications Series No : 1

© All Rights Reserved

First Edition: 2007

Copies : 5000

Cover Design : **P. Srinivas**

Published by
**A.P.V.N. SARMA,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
TIRUPATI - 517 507

DTP & Printed at
**Sri Parasarya Press**
Sri Vyasasramam
Ph: 08578-287528

# ముందుమాట

కలియుగదైవంగా ప్రశస్తిగాంచిన వేంకటరమణుని భక్తపరంపరలో ఒక్కొక్కరిది ఒక విశిష్టత. ఈ విశిష్టత ఆ యా భక్తులు శ్రీవారిని ఆరాధించటంలో అవలంబించిన మార్గాలవల్ల మనకు వెల్లడవుతూవుంటుంది. 'శ్రీవేంకటాచల మాహాత్మ్యం' వంటి సరస కావ్యాలను స్వామికి సమర్పించి తరించిన తరిగొండ వెంగమాంబ ఆ దేవ దేవుని భక్తబృందంలో అగ్రగణ్యయైన కవయిత్రీశిరోమణి!

ఈ 'కవితాతపస్విని' తిరుమల క్షేత్రంలో తపోవనం లాంటి ఒక తులసీ బృందావనాన్ని నెలకొల్పింది. ఆ 'బృందావనం'లో రాజయోగసాధనతో పాటు, వాఙ్మయ తపస్సు కావిస్తూ శ్రీనివాసునకు అంకితంగా అనేక కృతులను వెలువరించింది.

ఈ మహాకవయిత్రి రచించిన పదునెనిమిది కృతుల్లో చాలా భాగం అముద్రితంగా, సాహితీపరులకు అందుబాటులో లేనివిగా అజ్ఞాతంగా ఉంటు న్నాయి. తిరుమలేశునికి మీదుకట్టి అవతరించిన ఈ రచనల నన్నిటిని ప్రచురించవలసిన ఆవశ్యకతను గుర్తించి తిరుమల తిరుపతి దేవస్థానం ఈ కవయిత్రి పేరట ఒక గ్రంథ పరిష్కరణ ప్రాజెక్టును నెలకొల్పింది. ఈ ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలను తి.తి.దే. "శ్వేత" సంస్థ సంచాలకులయిన శ్రీ 'భూమన్' గారికి అప్పగించింది.

ఉద్యమస్ఫూర్తి మేళవించిన ఉత్సాహపూరితులయిన "శ్వేత" సంచాలకులు శ్రీ 'భూమన్' గారు ఇటీవలే ఈ కవయిత్రి సారస్వతంపై ఒక జాతీయ సాహితీ సదస్సును విజయవంతంగా నిర్వహించటమే కాక,. ఈ కవయిత్రి రచనల యందలి వేర్వేరు గీతాలకు ఆడియో సీ.డీ.లను తగిన గాయనీ గాయకులచే తయారు చేయిస్తుండటం మిగుల ముదావహమయిన విషయం.

హరికీర్తనాచార్యుడైన తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాల లాగానే, ఈ కవయిత్రి యొక్క సాహితీ సమారాధనోత్సవాలను ఈమె జన్మదినమైన నృసింహుని జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించడానికికూడా

తిరుమల తిరుపతి దేవస్థానం నిశ్చయించింది. ఇందులకు అనుగుణంగా మే 1వ తేదీన జరుపబోయే వెంగమాంబ జయంతి ఉత్సవ సందర్భంలో ఆవిష్కరించే నిమిత్తంగా ఈ క్రింది ప్రచురణలను చేపట్టి సిద్ధంచేస్తూవుండటం ఆహ్లాదదాయకంగా ఉంది.

1. తరిగొండ నృసింహశతకము

2. శ్రీవేంకటేశ్వర కృష్ణమంజరి (స్తుతి కావ్యము)

3. రమా పరిణయము (ద్విపద కావ్యము)

4. బాలకృష్ణ నాటకము (యక్షగానము)

5. చెంచు నాటకము (యక్షగానము)

6. భక్తిగీత సుధాలహరి (వెంగమాంబ యక్షగానాల్లోని 108 గేయాల సంకలనం)

7. అష్టాంగయోగ సారము (పద్యకావ్యము)

ఈ ప్రచురణలన్నీ సహృదయ సాహితీ లోకాన్ని అలరింపజేయగలవని ఆశిస్తున్నాను.

ఇలాగే ఈ భక్త కవయిత్రియొక్క రచనలన్నీ శ్రీనివాసుని దివ్యానుగ్రహ విశేషంచేత అచిరకాలంలోనే చక్కని పీఠికలతో గూడిన సుపరిష్కృత రూపాలతో వెలుగుచూడగలవని ఆకాంక్షిస్తున్నాను.

తిరుపతి — ఎ.పి.వి.ఎన్. శర్మ

28, మార్చి 2007 — శ్రీకార్యనిర్వహణాధికారివర్యులు

తిరుమల తిరుపతి దేవస్థానములు.

# మనవి

తెలుగులో అన్నమయ్య తరువాత రాశిలోనూ, వాసిలోనూ విష్ణు సాహిత్యాన్ని విరివిగా అందించిన మహాకవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. వెంగమాంబ 'తెలుగు మీరా'గా సుప్రసిద్ధురాలై, పోతనతో సాటియైన భక్తకవయిత్రిగా ప్రస్తుతింపబడింది.

శ్రీనివాసుణ్ణి రసరమ్యములైన కావ్యకుసుమాలతో పూజించి తరించిన సుమధుర సారస్వతమూర్తి తరిగొండ వెంగమాంబ. ఈ కవయిత్రి రచనలు శ్రీవేంకటేశ్వరుని సాహితీ మందిరంలో వెలిగించిన అఖండ దీపాలు. ఆ దీప కళికల కాంతులు ఈనాటికీ నిరంతరం ఆ తిరుమలేశుని దివ్య వైభవాన్ని అక్షరంగా ప్రకాశింపజేస్తున్నాయి.

తిరుపతికి పశ్చిమాన 100 కి.మీ. దూరంలో తరిగొండ గ్రామంలో ప్రభవించి, మధురకవితా సుధాధారలతో శ్రీ వేంకటేశుని అభిషేకించి తరించిన తెలుగు కవయిత్రి, అఖిలాంధ్ర జనయిత్రి తరిగొండ వెంగమాంబ.

సాంఘిక దురాచారాలపై సమరం ప్రకటించి, బాల వితంతువులపై ఆ నాడు జరిగే అన్యాయాలను ప్రతిఘటించి- తనకోసం కాదు- తనవంటి అభాగినులపై సంప్రదాయం పేరిట జరిగే అమానుష కృత్యాలను ఎదిరించి, తిరుగుబాటు బావుటా ఎగురవేసిన విప్లవవనిత వెంగమాంబ.

అనేకానేక ప్రక్రియలలో శతకాలు, యక్షగానాలు, ద్విపదలు, తత్త్వ సంబంధమయిన రచనలు, శ్రుతి, లయ సమన్వితములైన వేదాంతగీతాలు వెలయించటమేగాక, శ్రీ వేంకటాచలమాహాత్మ్యంవంటి బృహత్కావ్యములను రచించిన విదుషీమణి వెంగమాంబ.

శ్రీతరిగొండ వెంగమాంబ విశిష్ట వ్యక్తిత్వాన్ని పసిగట్టిన తిరుమల-తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, గౌరవనీయులు, సంస్కారి శ్రీ ఏ.పి.వి.యన్.శర్మ గారు ఈ కవయిత్రి రచనలను పరిష్కరించి, ప్రచురించుటకుగాను

'తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్టు'ను ఏర్పరచి అందుకు పరిష్కర్తగా శ్రీ కె.జె.కృష్ణమూర్తిగారిని నియమించినారు. ఆ ప్రాజెక్టు "శ్వేత" ఆధ్వర్యంలో పనిచేసేట్టుగా ఆదేశించినారు. స్వయాన సాహితీప్రియుణ్ణి అయిన నాకు తరిగొండ వెంగమాంబను గురించి తెలుసుకునే అవకాశం ఈ రకంగా కలిగింది. వెంటనే ఆమె సాహిత్యంమీద రెండు రోజులు జాతీయ సాహితీసదస్సు నిర్వహించటం, అనంతరం పుస్తక ముద్రణతో పాటు, ఆమె పాటలకు బాణీలు కూర్పించి, ఆడియో సి.డి.లుగా విడుదల చేయటానికి పూనుకున్నాను. తిరుమల-తిరుపతి దేవస్థానముల చరిత్రలో మొట్టమొదటి సారిగా ఆమె జన్మదినం సందర్భంగా రెండు రోజులపాటు సంగీత, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించతలపెట్టినాను. అతి త్వరలో అన్ని పుస్తకాల ముద్రణ, పాటల ఆడియో సి.డి.ల విడుదల పూర్తి చెయ్యాలనే పట్టుదలతో ఉన్నాము.

ఈ బృహత్ కార్యక్రమము సఫలీకృతం కావటానికి పూర్తి కారకులు శ్రీ ఏ.పి.వి.యన్.శర్మగారు; మా ప్రియతమ కార్యనిర్వహణాధికారి. వారికి తెలుగు సాహితీ, సంగీత ప్రియుల పక్షాన ధన్యవాదాలు.

*బి.యస్.రెడ్డి*
సంచాలకులు
**"శ్వేత"**

# పీఠిక

## 1. రచనా ప్రక్రియ:

తెనుగు సాహిత్యంలో 'శతక'మనే రచనాప్రక్రియ ఎంత ప్రాచీనమైనదో, అంత నవీనమైనది. శతకానికి ముఖ్య లక్షణాలు మూడు: i) మకుటం- అంటే రచయిత ఇష్టదైవాన్ని ఉద్దేశించిన సంబోధన ii) పద్య సంఖ్య- అనగా 'శతక'మనే పేరుకు అనుగుణంగా నూరు పద్యాలకు తక్కువ కాకుండా ఉండటం. ఛందస్సు- అంటే శతకంలోని పద్యాలు మొదటి నుండి చివరి వరకు ఒకే ఛందంలో రచింపబడివుండటం.

iii) పై మూడూ సామాన్యంగా తెలుగు శతకానికి ఉండవలసిన ముఖ్య లక్షణాలు.

తెలుగు శతకాల్లో భక్తి శతకాలది అన్ని విధాల అగ్రస్థానం. తెనుగులో అసంఖ్యాకంగా వెలువడిన భక్తిశతక సముదాయంలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ రచించిన "తరిగొండ నృసింహశతకము" విశిష్టమైనది. ఇది ఈ భక్తకవయిత్రి రచనల్లో మొట్టమొదటిది. ఆమె తరిగొండలో ఉండినప్పుడు రచించినది.

## 2. శతక స్వరూపం:

వెంగమాంబ లేఖినినుండి ప్రప్రథమకృతిగా అవతరించిన ఈ శతకంలో నూటమూడు పద్యాలు ఉన్నాయి. అందులో 65 ఉత్పలమాలలు, 38 చంపకమాలలు కలవు. "తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!"- అనేది ఇందలి 'మకుటం'. ఈ మకుటాన్ని బట్టే ఈ కృతికి "తరిగొండ నృసింహశతక"మనే నామధేయం ఏర్పడింది.

## 3. రచనోద్దేశం:

స్వగ్రామమైన తరిగొండలో వెలసి, తనకు ఇలవేల్పైయున్న శ్రీలక్ష్మీ నృసింహస్వామివారి యెడల తనకు గల భక్తి ప్రపత్తులను అక్షరరూపేణ వెల్లడించు పూనికతోను, తన రచనా వ్యాసంగానికి ఆది ప్రయత్నంగాను వెంగమాంబ రచించిన శతక మిది. ఈ శతకంలోని "అతులితమైన మీ పదవి నందఁదలంచి విశాలభక్తిచే"- ఇత్యాది మూడవ పద్యంద్వారా కవయిత్రి తనకు గల పరమోద్దేశాన్ని (అతులితమైన పదవిని- అనగా మోక్షాన్ని పొందాలనే ఆకాంక్షను) స్పష్టంగా వెల్లడించింది. నిజానికి 'ముక్తికాంక్ష'- అనే ఈ పరమలక్ష్యాన్ని ఉద్దేశించియే తరువాతి కాలంలో ఈమె సారస్వతమంతా వెల్లివిరిసింది. ఆ ధ్యేయం ఇలాగ ఆమె తొలిరచనలోనే వ్యక్తంకావడం ఒక విశేషం!

## 4.ప్రతిపాదించిన విషయాలు:

ఈ కృతిలో ఆ యా పద్యాల మూలంగా ప్రబోధింపబడిన విషయాలను బట్టి ఇందులో i) భక్తి ii) నీతి iii) వేదాంత, యోగ విశేషాలు iv) కవయిత్రి ఆత్మీయాంశ- అనేవి ప్రధానంగా ప్రతిపాదింపబడినవని గుర్తింపవచ్చు.

**i) భక్తి:** వెంగమాంబ 'అచ్చపుభక్తి'కి ఉదాహరింపదగిన పద్యాలు ఈ శతకంలో అనేకం ఉన్నాయి. వాటిలో 'దశావతారస్తుతి'- ఒక ఘట్టం. (చూ. 7 నుండి 16 వరకు గల పది పద్యాలు). ఈ కవయిత్రి భక్తిలో కొన్ని చోట్ల మధురభక్తి (నాయికాభావన) కూడ గోచరిస్తూవుంది. (చూ. 17,19,20,21 పద్యాలు).

**ii) నీతి** : వెంగమ లేఖినినుండి అలవోకగా వెలువడి, మిగుల సహజంగా భాసిస్తూవున్న నీతిపద్యాలు ఇందులో అచ్చటచ్చట నెలకొని వున్నాయి. మచ్చుకు 92, 95 సంఖ్యలుగల పద్యాలు తిలకింపదగివున్నాయి.

**iii) వేదాంత, యోగ విశేషాలు :** ఈ శతకం ప్రధానంగా భక్తి శతకమే అయినప్పటికీ, ఇందులో ఇంచుమించు 40 పద్యాల్లో జీవుడు, ఆత్మ, పరమాత్మ, సద్గురు మహిమ – మొదలైన పెక్కు తాత్త్విక విషయాలు ప్రవచింపబడివున్నాయి. ఈ వేదాంత, యోగ విశేషాల ప్రాశస్త్యాన్నిబట్టే కొందరు విమర్శకులు ఈ కృతిని వేదాంతశతకాల శ్రేణికి చెందిందిగా పరిగణించారు.

**iv) కవయిత్రి ఆత్మీయాంశ:** వెంగమాంబ ఆత్మీయాంశ ఈ రచనలో అద్దంలాగా సుస్పష్టరేఖలతో ప్రతిబింబించివుంది. ఈమె పద్య రచన ప్రారంభించిన తొలినాళ్లలోనే ఈమెది 'వికల్పకవిత' అనే విమర్శ బయలు దేరిందట! (చూ. 4ప.). 'వికల్ప కవిత్వం' అనగా 'కవిత్వం కాకపోయినా కవిత్వంలాగా కనిపించే రచన'- అని అభిప్రాయం. కాని, పై విమర్శ అసూయతో గూడిన పసలేని విమర్శ అనటానికి ఈ శతకమే సాక్ష్యం. ఈ ప్రథమరచననాటికే ఈ కవయిత్రి వివాహితయని, భర్తపేరు ఇంజేటి వేంకటా చలపతి యని ఇందలి చివరిపద్యం ప్రకటిస్తూవుంది.

ఇంతేగాక, గురువర్యుడు పాదమూలంచేత తన (శిష్యురాలి) నుదుటి వ్రాతను మార్చివేసినట్లు ఈ కవయిత్రి 41వ పద్యంలో పేర్కొనియున్నది. అందువల్ల, ఆ గురువు ఆధ్యాత్మికోపదేశంచేత ఈ కవయిత్రి జీవితానికి నూతనోత్తేజాన్ని ప్రసాదించినాడనే అర్థం సూచింపబడింది.

ఈ శతకరచనాకాలం నాటికే వెంగమాంబ ఇలవేల్పైన తరిగొండ లక్ష్మీనృసింహస్వామియొక్క పరిపూర్ణ కటాక్షానికి పాత్రురాలై యున్నట్లు ఈ శతకంలోని 32, 42, 86, 102 సంఖ్యలు గల పద్యాలు స్పష్టంగా చాటుతూవున్నాయి.

## 5.రచనా వైశిష్ట్యం:

ఈ శతకం వెంగమాంబ ప్రథమ రచన అయినప్పటికీ, ఇందులో కమనీయమగు కవితా వైచిత్రికి కొదువ లేదు. బమ్మెరపోతనార్యుని భాగవతము, ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకము, కంచెర్ల గోపనార్యుని దాశరథి శతకము-మున్నగు ప్రాచీన మహాకవుల రచనల ఛాయలు గోచరిస్తూవున్నాయి. అయినను, కొన్ని విశిష్ట గుణాలచే ఈ కృతి స్వతంత్ర వ్యక్తిత్వం కలదై అలరారుతూవుంది.

ఆ విశిష్టగుణాలు ఇవి:

i) కవయిత్రి యీ కృతిలో ఇష్టదేవతా, గురువందనాదికం మొదలుకొని చివరిదాకా నిర్మల భక్తినిష్ఠమైన తన మనఃక్షేత్రంలో అంకురించిన భావాలనే సహజధోరణిలో సంతరించింది.

ii) ఈ శతకశైలి ఒడిదుడుకులు లేక, నిరాడంబరమై, నిర్మలంగా, నిరర్గళంగా సాగుతూ, అక్కడక్కడ పూర్వకవుల కవితారీతులను సముచితంగా సమన్వయించుకొని, ఒకానొక ప్రత్యేకతతో విలసిల్లుతూవుంది.

iii) అత్యంత సహజమైన భక్తిభావాలు, అనుభవజనితాలైన తాత్త్విక భావాలు ఇందులో పడుగుపేకలుగా అల్లుకొనివుండటం చేత, ఇది అపూర్వమైన "భక్తివేదాంత శతకం"గా విరాజిల్లుతూవుంది.

## 6. పరిష్కరణ:

ఈ శతకాన్ని తొలుత విశ్వవిఖ్యాత పరిశోధకాగ్రేసరులు కీ.శే. మానవల్లి రామకృష్ణకవి మహోదయులు తమకు లభించియుండిన ఒక తాళపత్ర ప్రతి ఆధారంతో పరిష్కరించి 1944లో తి.తి.దే. శ్రీవేంకటేశ్వర

ప్రాచ్యపరిశోధనాలయ పత్రికలో చిన్న పీఠికతో ప్రకటించారు*. ఈ పత్రికలో ప్రచురింపబడిన ఆ ముద్రిత ప్రతి ఆధారంగానే ప్రకృత పరిష్కరణ కార్యం కొనసాగించబడింది.

అచ్చుతప్పులు, మఱికొన్ని స్ఖాలిత్యాలు ఈ పరిష్కరణలో సవరింప బడినాయి. ఇందులో ప్రతిపద్యం పాఠకుల సౌకర్యం నిమిత్తమై ఎనిమిది పంక్తులలో ముద్రింపబడింది. అలాగే, ప్రతి పద్యానికి సంగ్రహంగా భావం కూడ సమకూర్చబడింది. "ఆపరితోషాద్విదుషాం" అన్నరీతిగా ఈ ప్రచురణ సహృదయ పాఠకుల సమాదరాన్ని అందుకోగలదని ఆశయం.

---

See: Journal of Sri Venkateswara Oriental institute, TIRUPATI, Vol-V - No.I, January - June 1944, TELUGU, 1. శ్రీతరికొండ నృసింహశతకము, Sri M. Ramakrishna kavi, pp:1-16

## శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు రచించిన పీఠిక

# పీఠిక

ఈ నృసింహశతకము రచించిన కవి తరికొండ వెంగమాంబ. ఈ తరికొండ కడపమండలములో నొక గ్రామము. అచ్చట నధిష్ఠితుండగు నృసింహస్వామి మహావరప్రదాతయని ప్రఖ్యాతి వడసి భక్తలోకముచే నిరంతర మారాధ్యమానుండగుచుండు. వెంగమాంబ చిరకాల మచ్చట వసియించి పిదపం దిరుమలలో నివాసము కుదుర్చుకొని శ్రీ వేంకటాచలపతి కైంకర్యమున జీవితకాలము పుచ్చుచుండెను. ఆంధ్రభాషలోం గులస్త్రీ కవయిత్రులలో నీమెయు గణనార్హ. కుమ్మరమొల్ల, మదినె సుభద్రమ్మ మొదలగువారు కులస్త్రీలు. మధురవాణి, రంగాజి, ముద్దుపళని ప్రభృతులు గొప్ప కవులయినను వారి యుదంతము నిశ్చయముగాం దెలియదు. వెంగమాంబ రాజయోగసారము,భాగవతము ద్విపదకావ్యములుగాను, వేంకటాచల మాహాత్మ్యము పద్యరూపముగను విరచించె. ఈ శతకము లఘు కావ్యమైనను స్వగ్రామదేవతాస్తుతి యగుటచే వేంగమాంబ కున్న యిష్టదేవతా భక్తిని వెల్లడించుచున్నది ఒక్క తాళపత్రప్రతిం జూచి దీనిని ముద్రించినారము. భగవద్భక్తుల కిది యింపు గొలుపు ననుట నిక్కము. ఈమె సుమారు 150 సంవత్సరములకుం బూర్వముండె ననవచ్చు. ఈ కవి బ్రాహ్మణస్త్రీ, నియోగికుల సంజాత. కృష్ణమంత్రి తనూజ. ఇంజేటి వెంకటాచలపతి భార్య. బాల విధవయని పండితు లూహించుట కాధార మేమియుం గానరాదు. దీనిలో రాజయోగసారాది గ్రంథములలో వివరింపంబడిన షట్చక్రాది శరీర యోగముద్రా రహస్యములు చూపంబడినవి. ఇందుంగొన్నిచోటుల వ్యాకరణ ఛందోదోషములును, నశ్లీల పదప్రయోగమును గానవచ్చుచున్నవి. వస్తు స్వరూపము ననుసరించి తదధికారులకు దోషగణనము ప్రధానము కానేరదు.

**మా. రామకృష్ణకవి, ఎం.ఏ.,**

# కృతజ్ఞతలు

తిరుపతి ఉత్సవాల్లో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సారస్వతాన్నిగూర్చి ఉపన్యసించే సదవకాశాన్ని కల్పించటం ద్వారా ఈ వాఙ్మయ పరిష్కరణ ప్రాజెక్టుకు మూలవిరాట్టుగా అంకురార్పణ కావించిన సహృదయవతంసులు తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి అధ్యక్షవర్యులు శ్రీ భూమన కరుణాకరరెడ్డి మహోదయులకు, తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి సభ్యులెల్లరకు నా అనేక హార్దిక ధన్యవాదములు.

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ పరిష్కరణ ప్రాజెక్టు రూపొందటంలో మూలకారణులయిన సహృదయవతంసులు తిరుమల తిరుపతి దేవస్థాన శ్రీకార్యనిర్వహణాధికారివర్యులు, సుగృహీతనామధేయులు శ్రీ ఎ.పి.వి.ఎన్. శర్మ, ఐ.ఏ.యస్., మహోదయులకు నా అనేక హార్దిక ధన్యవాదములు.

తిరుమలలో సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ జి. బలరామయ్య, ఐ.ఏ.యస్.,గారు, తిరుపతిలో సంయుక్తకార్యనిర్వహణాధికారి శ్రీఎన్.శ్రీకాంత్, ఐ.ఏ.యస్.,గారు- ఈ ఉన్నతాధికారు లిరువురకు నా అనేక హార్దిక ధన్యవాదములు.

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ పరిష్కరణ ప్రాజెక్టుయొక్క సర్వతోముఖమైన వికాసానికి తమ ఉద్యమస్ఫూర్తిని ప్రసాదించి, ఉత్సాహ, ప్రభుశక్తి పూరితమైన దక్షతతో ముందుకు నడిపిస్తూవున్న తి.తి.దే. "శ్వేత" సంస్థ సంచాలకులు, సహృదయవతంసులు, "భూమన్"గా సుగృహీత నామధేయులయిన శ్రీ భూమన్ సుబ్రహ్మణ్యంరెడ్డి మహోదయులకు నా అనేక హార్దిక ధన్యవాదములు.

తి.తి.దే. పౌరసంబంధాధికారివర్యులు సరసహృదయులు శ్రీయుతులు కె.రామ్‌పుల్లారెడ్డిగారికి నా అనేక హార్దిక కృతజ్ఞతాభివాదములు.

టి.టి.డి. "శ్వేత" కేంద్రగ్రంథాలయం లైబ్రేరియన్ సోదరీమణి శ్రీమతి ఎన్. లీలావతిగారికి, వారి సహాయోద్యోగులయిన మిత్రబృంద మందరికీ-

"శ్వేత" సంస్థ కార్యాలయం సూపరిండెంటెంట్ శ్రీ వి. దామోదరం గారికి, వారి సహోద్యోగిబృందమందరికీ, మిత్రుడు శ్రీ జి. సురేష్‌కుమార్ (యు.డి.సి) గారికి-

"శ్వేత" సంస్థ కో-ఆర్డినేటర్స్ శ్రీ పి. రమణారెడ్డిగారికి, మిత్రుడు డా॥ యన్.యస్. బాలాజీరావుగారికి, తదితర మిత్రులందరకూ-

నా అనేక హార్దిక కృతజ్ఞతాభినందనములు.

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధనసంస్థ డైరెక్టర్ ఆచార్య వి. వేంకటరమణారెడ్డిగారికి, వారి సహోద్యోగులకు అనేక హార్దిక కృతజ్ఞతాభినందనములు.

ఈ పుస్తకమును ముచ్చటగా ముద్రించిన శ్రీవ్యాసాశ్రమము (ఏర్పేడు) శ్రీపారాశర్య ముద్రణాలయము వారికి నా హార్దిక కృతజ్ఞతాభినందనములు.

మాతృశ్రీ తరిగొండవెంగమాంబాకవయిత్రియొక్క ఆరాధ్య దైవమయిన "శ్రీతరిగొండ శేషకుధరాధ్యక్షు"నకు నా భక్తిపూర్వక ప్రణామాంజలి.

--కె.జె. కృష్ణమూర్తి

# తరిగొండ నృసింహ శతకము

## విషయ సూచిక


| విషయము. | పుట. |
|---|---|
| ముందుమాట | iii |
| మనవి | v |
| పీఠిక | vii |
| 1. శ్రీమానవల్లి రామకృష్ణ కవిగారు రచించిన పీఠిక | xii |
| 2. తరిగొండ నృసింహ శతకము | 1-104 |

# తరిగొండ నృసింహ శతకము

*శ్లో॥ శ్రీకాంతాత్మసరోజ చండకిరణం,

శీతాంశు బింబాననం,

శ్రీకంఠాబ్జజ సన్నుతాంఘ్రికమలం,

చిన్మాత్ర, మప్రాకృతమ్ ।

లోకాతీత, మనేక గోపయువతీ

లోలం, పరం, సర్వగం,

స్వాకారం తరిగొండ శేషకుధరా

ధ్యక్షం భజేఽహం సదా॥

**భావం:**

శ్రీమహాలక్ష్మియొక్క మనస్సనే పద్మాన్ని వికసింపజేసే సూర్యుడూ, చంద్ర బింబంవంటి ఆహ్లాదకరమైన ముఖం కలవాడూ, పరమశివునిచే, బ్రహ్మదేవునిచే స్తుతింపబడిన చరణకమలాలు కలవాడూ, జ్ఞాన స్వరూపుడూ, లోకాలన్నిటికి అతీతుడూ, అనేక గోపయువతుల యెడ అనురాగం కలవాడూ, అంతటా వ్యాపించి యుండే సత్య స్వరూపుడూ, దేవాదిదేవుడూ, పరంధాముడూ అయిన తరిగొండ (లక్ష్మీనృసింహుడు) అనే శేషాచలాధిపతియయిన వేంకటేశ్వరుణ్ణి నిత్యం భక్తితో ఆరాధిస్తున్నాను.

*ఈ శ్లోకం వెంగమాంబ తిరుమల క్షేత్రంలో రచించిన కృతుల్లో అగ్రగణ్యమయిన "శ్రీవేంకటాచల మాహాత్మ్య" మనే పద్యకావ్యంయొక్క ప్రారంభంలో ఉంది. స్తుతి సుందరమైన ఆ శ్లోకాన్ని కవయిత్రి తరువాతి కాలంలో ఈ శతకానికి మొదట తిలకాయమానంగా చేర్చినట్లు భావింపవీలౌతున్నది.

1

ఉ. శ్రీరఘురామ! మీ కృపను
చెల్వము మీఱఁగ శ్రీ గణేశునిన్,
వారిజ గర్భునిన్, భవుని,
వాణిని, దుర్గను, క్షేత్రపాలకున్,
సారెకు సర్వదేవతల,
సత్కవిశూరులనెల్ల, భక్తి నిన్
కోరి భజింతునయ్య! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవైన, తరిగొండలో నెలకొనియున్న శ్రీలక్ష్మీ నృసింహదేవా! శ్రీ రఘురామా! మీ కృపచేత గణపతినీ, శివుణ్ణీ, బ్రహ్మ, సరస్వతి, దుర్గాదేవి– మొదలైన సమస్త దేవతలనూ, ఉత్తమ కవీశ్వరులనూ, దేవదేవుడవైన నిన్నూ పదేపదే భక్తితో సేవిస్తున్నాను.

**2**

చ. మఱియును రెండు విండ్లకును
మధ్యమునన్ ఘనసాక్షిరూపమై
పరఁగుచు, యోగనిద్ర సుర
పన్నగ తల్పమునందు ధీరుఁడై
సరసతఁ బవ్వళించి, యట
సంతత లీలను విశ్వమేలు స
ద్గురుని భజింతునయ్య! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసాగరుడవైన తరిగొండ లక్ష్మీనృసింహస్వామీ! కనుబొమల నడుమ నున్న ఆజ్ఞాచక్రంలో జగత్సాక్షివై నీవు ప్రకాశిస్తున్నావు. శేషతల్పంమీద సొంపుగా పవ్వళించి యోగనిద్రలో నిమగ్నుడవైయుండి, నిరంతరం ఈ విశ్వాన్ని లీలగా పరిపాలిస్తూవున్న జగద్గురూ! నిత్యమూ నిన్ను భక్తితో సేవిస్తున్నాను.

**3**

చ. అతులితమైన మీ పదవి

నందఁదలంచి, విశాలభక్తిచే

వితరణగాను మీ రిపుడు

వేడ్కను వాక్కుల నిచ్చినంతలో

శతకముగాను జెప్పెదను

సద్గురు స్వామి కటాక్ష మేర్పడన్,

కుతుకము మీఱఁగాను తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయి తరిగొండలో వెలసియున్న శ్రీలక్ష్మీ నృసింహదేవా! సాటిలేని మీ పదవిని (మోక్షాన్ని) అందుకోవలెననే తలంపు గలిగి, భక్తవత్సలుడవైన నీవు ప్రసాదించిన వాక్కులతోనే, సద్గురువర్యుని అనుగ్రహంవల్ల, ఆసక్తితో మీపై శతకాన్ని చెపుతున్నాను. చిత్తగించు!

## 4

చ. కరుణయు లేక కొందఱు వి
కల్ప కవిత్వమటంచుఁ బల్కినన్,
సరగున నీవు వారలకు
సమ్మతిఁ జెప్పి, పరాకు సేయకే!
పరువడితోను నీ శతక
పద్యము లింక ధరిత్రిమీఁదటన్
గుఱుతుగ నిల్పవయ్య! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయి తరిగొండలో అవతరించిన శ్రీ లక్ష్మీ నృసింహదేవా! కొంతమంది (పెద్దలు) దయలేనివారై, నా యీ రచనను 'వికల్పకవిత్వం' (కవిత్వంకాని కవిత్వం)- అని విమర్శిస్తున్నారు. అలాంటివారికి నీవే సద్బుద్ధిని ప్రసాదించి, సదభిప్రాయాన్ని కలిగించు! అంతేగాక, ఇకపై ఈ శతక పద్యాలు ఈ లోకంలో స్థిరంగా నెలకొనేట్లుగా పరాకు లేక, అనుగ్రహించు తండ్రీ!

**5**

చ. హరి! నరసింహదేవ! నను
నందఱిలోనఁ బరాకుసేసినన్
దరి యెవరయ్య? సామి! ఘన
తాపసరంజన! నీవె గాక, ఓ
పరమదయార్ద్ర! నాహృదయ
పద్మమునన్ వసియించి, ప్రేమతో
గుఱిగొని వాక్కు నిమ్ము! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన తరిగొండ శ్రీలక్ష్మీనరసింహదేవా! శ్రీహరీ! ఈ లోకంలో నాకు దిక్కైనవారు, నన్ను దరి జేర్చేవారు నీవు తప్ప మఱి లేరు. గొప్ప గొప్ప తపోధనులను రంజింపజేసే పరమకృపా పరతంత్రుడవైన ఓ స్వామీ! నన్ను ఉపేక్షసేయక, నా హృదయపద్మంపై ప్రీతితో అధివసించి, మిమ్ము కొనియాడే చక్కని వాక్కులను ప్రసాదించు!

**6**

ఉ. అచ్చపు భక్తితోడ దను

జాంతక! నే నిటు సర్వకాలమున్

హెచ్చుగ మీ పదాబ్జముల

నింపుగ నమ్మినదాన, మాధవా!

మచ్చికతోడ నన్నెపుడు

మన్ననసేయు మహానుభావ! యే

కుచ్చిత ముంచఁబోకు! తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయి తరిగొండలో ఆవిర్భవించియున్న శ్రీలక్ష్మీ నృసింహదేవా! రాక్షసాంతకుడవైన మాధవా! ఎంతో కాలంగా నేను అచ్చమైన భక్తిభావంతో మీ పాదపద్మాలనే పరిపూర్ణంగా నమ్ముకొని యున్నాను. కావున, ప్రేమతో నన్ను ఆదరింపుమా! మరో విధంగా భావించి నన్ను విడనాడవలదు మహానుభావా!

## 7

ఉ. కంజదళాక్ష! యా బుధులఁ
గావఁదలంచియు సోమకాసురున్
భంజనచేసి, యంతటను
భాసురలీలను వేదముల్ తగన్
రంజనచేసి, యా క్షణమె
బ్రహ్మకు నిచ్చిన ధీర! మ్రొక్కెదన్
కుంజరరాజపాల! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన తరిగొండ శ్రీలక్ష్మీనృసింహదేవా! కమలాక్షా! పూర్వం నీవు సోమకుణ్ణి సంహరించి, ఆ రక్కసుడు అపహరించియుండిన వేదరాశిని వెంటనే చెక్కుచెదరకుండా సృష్టికర్తకు ప్రసాదించినావు. ఆ విధంగా లోకమందలి బుధజనులను అందరినీ ఉద్ధరించిన ధీరుడా! గజరాజరక్షకా! మీకు నమస్కారం!

## 8

చ. పరఁగఁగ దేవదానవులు
వార్ధి మథింపఁగఁబూనినంత, మం
దరగిరి గ్రుంగఁగాఁ, దెలిసి
దానికిఁ గచ్ఛపరూపమెత్తియున్
సరసత మూఁపునన్ నిలిపి,
సర్వజగంబులు మోచినాఁడవౌ!
గుఱుతుగ నన్నుఁ బ్రోవు! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసాగరుడవయిన తరిగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామీ! దేవ దానవులు పాలసంద్రాన్ని మందరగిరితో మథిస్తూవున్నప్పుడు అది క్రిందకు క్రుంగిపోగా, నీవు కూర్మావతారాన్ని ధరించి, ఆ పర్వతాన్ని పై కెత్తి, అటుపై సకల లోకాలను సవ్యంగా భరించినావు. అటువంటి కూర్మావతారుడవైన నీవు నన్ను తగిన విధంగా సంరక్షించుమా!

## 9

ఉ. వాడక హేమలోచనుఁడు

వార్ధిని వైతునటంచు భూమినిన్

వోఁడిమిమీఱ నెత్తుకొని

వోవుచునుండినయంతలోన, మా

టాడక వానిఁ ద్రుంచియు, ధర

రాస్థలి రక్షణసేయఁజాలు సత్

క్రోడసమగ్రరూప! తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవైన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! హిరణ్యాక్షుడు భూమండలాన్ని పైకెత్తుకొని సాగరంలో వేయటానికి వెళ్లుతూవుండగా, వరాహరూపుడవై మాఱు మాట్లాడకుండా వాణ్ణి సంహరించి భూదేవిని యథాస్థితిలో పాదుకొల్పి, సంరక్షించావు. అట్టి ఉదాత్తమైన ఆదివరాహావతారా! మీకు అభివందనం!

## 10

చ. ఫెళఫెళ నుక్కుకంబమున
బిట్టుఁగ బుట్టి, హిరణ్యకశ్యపున్
చెలువుగ గర్భగోళమును
జించి, సమంచిత రక్తధారలన్
గళగళఁ ద్రావి, డింభకునిఁ
గాచిన దేవుఁడవంచుఁ జాలఁగాఁ
గొలిచితినయ్య! నిన్నుఁ దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! ఉక్కు కంబాన్ని ఫెళఫెళ ధ్వనులతో చీల్చుకొని ఆశ్చర్యకరంగా అవతరించిన నరసింహ స్వరూపా! హిరణ్యకశ్యపుని చంపి వాని గర్భగోళంలోని రక్తాన్ని గళగళధ్వనితో పానం చేసి, పరమభక్తాగ్రేసరుడైన ప్రహ్లాద కుమారుణ్ణి పరిరక్షించిన దేవదేవుడవని మిక్కిలిగా భజిస్తున్నాను. మహానుభావా! మీకు ప్రణామం!

## 11

ఉ. ఏమనవచ్చు! మూఁడడుగు

లిద్ధర నిమ్మని కౌతుకంబునన్

తామసమింతలే కడుగఁ,

దప్పక దానవుఁ డిచ్చినంతలో

వేమఱు దానవాధిపుని

విశ్వములోనికిఁ ద్రొక్కినాఁడవౌ!

కోమల నీలవర్ణ! తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహదేవా! దానవ రాజైన బలిచక్రవర్తిని ఏ మాత్రం తొణకని కుతూహలంతో మూడ డుగులు దాన మడిగి, ఆతణ్ణి నెమ్మదిగా పాతాళానికి అణగద్రొక్కినావు. కోమల నీలవర్ణా! నీ అద్భుతచర్యను ఏమని కొనియాడగలము! అటువంటి అపూర్వమైన త్రివిక్రమ వామనావ తారా! మీకు నా అభివందనం!

## 12

చ. పరశువు చేతఁబూని, నర

పాలవరేణ్యుల మస్తకంబులన్

ఇరువదియొక్క మాఱు సుర

లెల్ల నుతింపఁగఁ ద్రుంచి, రక్తమం

దరయఁగఁ దల్లిదండ్రులకుఁ

దర్పణ మొప్పఁగఁ జేసినాఁడవౌ!

గుఱుతుగ మేరుధీర! తరి

గొండ నృసింహా! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన తరిగొండ లక్ష్మీనృసింహదేవా! నీవు గండ్రగొడ్డలిని చేతబూని నిరంకుశులయిన రాజన్యుల శిరస్సులను దేవతలు నుతిస్తూవుండగా ఇరువదియొక్క పర్యాయాలు ఛేదించి, వారల రక్తంతో తల్లిదండ్రులకు తర్పణాలు విడిచిన సాహసివి! అలాంటి అద్వితీయ పితృభక్తిపరాయణుడవూ, మేరునగ ధీరుడవూ– అయిన పరశురామావతారా! నీకు నమస్కారం!

## 13

చ. దశరథ రాజుకుం బొడమి,
తాటకc జంపి, మునీంద్ర యాగమున్
విసువక కాచి, యంతటను
వేడుకతో మిథిలాపురంబునన్
పశుపతివిల్లు ద్రుంచియును,
పంతము మించcగ గెల్చి యేలితౌ!
కుసుమశరారిమిత్ర! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసాగరుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహస్వామీ! నీవు దశరథమహారాజుకు పుత్రుడవుగా అవతరించి, బాల్యంలోనే 'తాటక' అనే రక్కసిని సంహరించావు; విశ్వామిత్ర మునీంద్రుని యజ్ఞాన్ని కాపాడినావు. మిథిలాపురి కేగి, శివధనుస్సును త్రుంచివేసి, సీతాదేవిని పరిణయమైనావు. తదుపరి, పంతంతో రావణున్ని జయించి, ఈ భూమండలాన్ని ప్రజారంజకంగా పరిపాలించావు. పరమేశ్వరునకు మిత్రుడవుగా ప్రశస్తిగాంచిన శ్రీరఘురామావతారా! మీకు నా నమోవాకం!

## 14

చ. మొనసియు దేవకీసతికి

ముద్దుల బాలుఁడవై జనించియున్,

ఒనర యశోద చెంగటన

నున్నతి యొప్పఁగ వృద్ధి పొందుచున్,

ఘనమగు సాహసంబునను

కంసు వధించిన శూర! మ్రొక్కెదన్

గొనకొని నన్నుఁ బ్రోవు! తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! వసుదేవుని పత్నియైన దేవకీదేవికి ముద్దుల కొమరుడవై అవతరించావు; నందునిసతియైన యశోదాదేవి వద్ద చక్కగా, హాయిగా పెరిగినావు. అపూర్వమైన సాహసంతో క్రూరుడైన కంసుణ్ణి వధించావు. అలాంటి శూరవరేణ్యుడవైన నీకు నా వందనం! పురుషోత్తమా! నీ భక్తురాలినైన నన్ను పూనుకొని రక్షింపుమా!

## 15

ఉ. నిండిన భక్తితోడుతను

నిన్ను నుతించెద సర్వకాలమున్,

అండజవాహ! నిన్నుఁ గొని

యాడిన భాగ్యఫలం బదెట్టిదో!

పండెను నాదు కోరికలు

పండితపాలన! బుద్ధరూప! ఓ

కుండలిశాయివైన తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహస్వామి! ఓ గరుడవాహనా! నిన్ను కొనియాడినందువల్ల కలిగిన పుణ్యాల ఫలితం ఎంతటిదో! కాని, అందువల్ల నా కోరికలు పూర్తిగా పండినాయి. కావున కలకాలం మిమ్ములను పరిపూర్ణమైన భక్తితో కొనియాడుతూ వుంటాను దేవా! జ్ఞానులయిన సజ్జనులను సంరక్షించే శేషశాయీ! బుద్ధావతారా! మీకు నా అభివాదం!

## 16

చ. రవికులవార్ధిచంద్ర! గురు
రాయని వాక్యము మీఱ కెప్పుడున్
కవిజనపాల! నీ మహిమఁ
గాంచెద నింకను కల్కిరూప! యా
శివుని విధంబుఁ జూచెదను,
జీవుని నాత్మను జేరఁ జేసెదన్;
కువలయపత్రనేత్ర! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! కలువరేకులను పోలిన అందమైన కన్నులు గలవాడా! సూర్యవంశమనే సముద్రానికి పూర్ణచంద్రుడా! నా గురువర్యుని ఉపదేశానుసారంగా నేడు నేను నీ మహిమను చూడగలుగుతున్నాను. అందువలన నా జీవాత్మను పరమాత్మతో అను సంధింపజేయగలుగుతున్నాను అటుపై, మంగళకరుడైన శివునితో అభిన్నంగా భావన చేయగలుగుతున్నాను. కవిజనులను కాపాడే కల్కి అవతారా! మీకు నా నమస్కారం!

## 17

చ. వినుము మహానుభావ! మది
వేడుకతోడుత విన్నవించెదన్
మొనసెడు స్వాతివానలకు
ముత్యపుఁజిప్ప లవెట్టులుండు న
ట్లనిశము భక్తియుక్తి నిను
నాత్మవిభుండవు నీవటంచు, నీ
కును నెదురేను జూతుఁ; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయి తరిగొండలో ఆవిర్భవించియున్న శ్రీలక్ష్మీ నరసింహదేవా! మహానుభావా! మిక్కిలి వేడుకతో విన్న విస్తూవున్న ఈ నా మనవిని చిత్తగించు! ముత్తెపు చిప్పలు స్వాతికార్తెలో కురిసే వానలకు ఎదురు చూచిన రీతిగా, నా ఆత్మప్రభుడవైన నీ రాకకై ఎల్లప్పుడు భక్తితో నేను ఎదురుచూస్తూవున్నాను.

(కావున, కృపతో నీ దివ్యదర్శనాన్ని అనుగ్రహించు!)

## 18

ఉ. నారదసన్నుతాంఘ్రియుగ!

నా విధమెల్లను విన్నవించెదన్

సారెకు నల్లకల్వ లల

చంద్రునిఁ జూడఁదలంచుభంగినిన్

ధీరతమీఱ నిన్నెపుడు

దేహములోఁ బొడగాంచు భాగ్యముల్

కోరుచునుందునయ్య! తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహదేవా! పరమభాగవతోత్తముడైన నారదమునీంద్రునిచే కొనియాడబడిన చరణద్వయం గల మహనీయా! నా జీవన విధానమంతా మీకు విన్నవిస్తూవున్నాను, చిత్తగించండి! నల్లకలువలు చంద్రుణ్ణి ఆసక్తితో చూడగోరినట్లుగా, ఈ దేహంలో నిన్ను నిమ్మళంగా దర్శించే భాగ్యం ఎప్పుడు లభిస్తుందా? – అని ఆతురతతో ఎదురుచూస్తూవున్నానయ్యా! స్వామీ! అనుగ్రహించు!

## 19

ఉ. మరగితి నీ పదాబ్జముల
మానసమం దెడఁబాయఁ జాలకన్,
గరిమను [1]భానుఁ డొచ్చుటకుఁ
గంజములెల్ల నపేక్షసేయు నా
కరణిని నీవు వచ్చుటకు
గట్టిగ నా హృదయాంబుజంబు మేల్
గుఱుతుగఁ గోరునయ్యా! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! నా మనస్సు నీ పాదపద్మాలను ఎడబాయజాలని విధంగా మచ్చిక అయ్యింది. అందువల్ల నాహృదయ సరోజం కమల సమూహం సూర్యుని రాకను కోరినట్లుగా దృఢంగా మీ రాకను కోరుతూవున్నది.

(దయచేసి నా మనఃపద్మపీఠంమీదకు వేంచేయుమా! స్వామి!)

1. 'భానుఁడు + వచ్చుటకు' – అని పద విభాగము.

## 20

చ. 'హరి! హరి! రమ్ము ర'మ్మనుచు

నార్భటమందుచు నేను పిల్చినన్

పరువున రావదేమి? నినుఁ

బట్టుగ భక్తులు గట్టివేసిరో?

మఱచితొ నన్ను నొల్లక, ర

మా సతి నిన్నిటు చేరనీయదో?

గుఱిగొని రావదేమి? తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! 'శ్రీహరీ! ఓ నరహరీ! రమ్ము!ర' మ్మని భక్త్యావేశంతో నేను పిలిచినప్పటికీ, నీవు వేగంగా రావటంలే దెందులకు? భక్తు లెవరయినా నిన్ను కట్టు కదలనీయక కట్టివేసినారా? లేక, నన్ను మరచిపోయావా? లేదా, లక్ష్మీదేవి నిన్ను ఇటువైపు రానియ్యడం లేదా? ఆసక్తితో నీవు రాకున్నావేల? (శీఘ్రమే వేంచేయుమా! మహానుభావా!)

## 21

ఉ. మానక నేను పిల్చినను
మక్కువ లేక పరాకుసేసితో?
వీనుల సోఁకక లేక తగ
విశ్వము పాలనసేయఁబోతివో?
పూని మహావినోదమున
భోగము మీఱఁగఁ జెంచుభామతోఁ
గోనలనుండి రావొ? తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! విడువకుండా నే నెంతగానో భక్తితో పిలిచినప్పటికీ, నామీద ప్రీతి లేనందున ఉదాసీనత వహించియున్నావో? లేక, ఈ విశ్వాన్ని పరిపాలించటానికి వెళ్లిపోయినందువల్ల నా పిలుపు నీ చెవులకు వినబడలేదో? అటుగాక, చెంచులక్ష్మితో గూడి కొండకోనల్లో విహరిస్తూ ఆనందంలో నిమగ్నుడవై ఉన్నందున, ఆ అడవుల్లోనుండి రాజాలక యున్నావో? (కృపాంతరంగా! త్వరగా విచ్చేయుమా!)

## 22

ఉ. నెమ్మదితోడ నిచ్చటను
నీ నిజరూపముఁ జూడ వేడుకై
రమ్మని నేను పిల్చినను
రాజసమో, దయలేకయుంటివో,
సమ్మతి గాదొ, లేక నిను
సారెకుఁ బిల్చిన రావదేమొకో?
కొమ్మనవేమి ముక్తిఁ? దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! నీ నిజ స్వరూపాన్ని చూడవలెననే కుతూహలం కలిగి నేను నిండు మనస్సుతో పిలుస్తూవున్నా, రాజస స్వభావంతో రాదలంప కున్నావా? లేక, నాపై నీకు దయ కలుగలేదా? లేదా, ఇటువైపు రావడం నీకు ఇష్టంలేదా? పదే పదే నిన్ను పిలుస్తూవున్నప్పటికీ ఏలకో రాకున్నావు? వచ్చి, ముక్తిని ప్రసాదింపకున్నా వెందులకు?

## 23

ఉ. మేలు! కృపాంతరంగ! నిను
మిక్కిలి నే నిటు పిల్చి పిల్చినన్
ఏల పరాకు చేసెదవె?
యిప్పుడు నిన్నెడఁబాయఁజాలకన్,
చాలగు నీ పదాబ్జముల
సారములెల్ల మిళిందభాతిగన్
గ్రోలుచునుందునయ్య! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! కరుణాహృదయా! మేలగునుగాక! ఇంతగా నేను పలుమార్లు నిన్ను పిలుస్తూవున్నప్పటికీ పరాకు చేస్తున్నావెందులకో? ఇప్పుడు నిన్ను ఎడబాయలేక, నీ పాదపద్మాలనుండి చాలుగా స్రవించే సారాన్ని (జాల్వారే భక్తిభావన–అనే మకరందాన్ని) తుమ్మెదలాగా పానం చేస్తూ వుంటున్నానయ్యా! చిత్తగించు!

## 24

ఉ. సుందర దేహ! నిన్నిచటఁ
జూచెదనంచు నపేక్షసేయుచున్
మందరధారి! రమ్మనుచు
మాటికిఁ బిల్చిన నిప్డు వచ్చి, నా
ముందర నిల్చి పల్కఁదగు,
ముద్దులు గుల్క నటింపుమన్న! యీ
కుందకమేల నింకఁ? దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయి తరిగొండలో విరాజిల్లుతూ వున్న శ్రీలక్ష్మీ నృసింహస్వామీ! మందరగిరిధారీ! ఓ సుందరదేహా! నిన్ను సందర్శింప వలెననే ఆకాంక్షతో పదేపదే ప్రార్థిస్తూవున్నాను. కనుక, నా యెదుట సాక్షాత్కరించి, ముద్దులు గులికేట్టు మాటాడుతూ నర్తింపగోరుతున్నాను. ఈ నాకోరికను నెరవేర్చక జాగుసేయుచున్నావేల? (ఏలాటి అభ్యంతరం లేకుండా శీఘ్రంగా నీ దివ్యదర్శనాన్ని అనుగ్రహింపుమా!)

## 25

ఉ. సారములేని సంసరణ
సర్పము చేతికిఁ జిక్కలేక, యా
తేరకు లేని యాసలను
దెచ్చుక యింక నటింపలేక, యా
పారము లేద యెక్కడికిఁ,
బాపము మాయెడ వాంఛఁజేసె; నీ
ఘోరముఁ బాపవయ్య! తరి
గొండ నృసింహా! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! ఏ మాత్రం సారం లేని సంసారమనే సర్పానికి చిక్కలేకున్నాను; లేనిపోని జీవితాశలను తెచ్చిపెట్టుకొని, ఐహిక జీవితంలో నటింపలేకున్నాను. అంతులేని ఈ జీవనయానంలో పాపకార్యాలు నన్ను లోబరచుకోవాలనే కోరికతో చూస్తూవున్నాయి! ఘోరమైన ఈ ప్రమాదాన్ని కృపతో నివారించుమా! స్వామీ!

## 26

ఉ. ఉబ్బుచుఁ దేరతేరకును,
నూరక లేనటువంటి యాసలన్
బెబ్బులిచేతఁ జిక్కి, తను
భేదము లెన్నుచు నున్నదాన; నా
మబ్బును పద్మమిత్రుగతి
బ్రమందఁగ సంహరణంబుఁజేసి, నన్
గొబ్బునఁ గావవయ్య! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! మాటిమాటికిని నా మనస్సులో అంకురించి తలయెత్తే ఆశలనే పెద్దపులికి చిక్కియున్నాను; అలా చిక్కియుండి, నావారు, పెరవారు- అనే భేదభావనతో ప్రవర్తిస్తూవున్నాను. ఈ భేదభావన అనే మబ్బును, సూర్యుడు మేఘాన్ని తొలగించినట్లుగా, పూర్తిగా నశింపజేసి, (అందరిలో నీవే ఉన్నాడవనెడి) నిజమైన భావనను కలిగించి, వేగమే నన్ను కాపాడుమా! తండ్రీ!

## 27

చ. అనిశము దుష్టవర్తనుల
నార్గురి సాధక మెట్లు చేతు? నా
మనమున నుండుటన్ దురభి
మానము నెట్లు సవాలు చేతు? మ
జ్జనమును, భోజనం బుడుగు
సాధక మే గతిఁ జేతు? నింక నా
కును నొకదారిఁ జూపు! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన తరిగొండ లక్ష్మీనృసింహదేవా! ఎల్లవేళలా చెడుగా ప్రవర్తించే నాలోని ఆరుగురిని (అరిషడ్వర్గాన్ని) ఏ విధంగా అదుపు చెయ్యగలను? ముఖ్యంగా, నామనస్సులోనే ఉండే దురభిమానాన్ని ఏలాగున దబాయించి నిరోధించగలను? స్నానం, పానం, భోజనం- వీటిని విడిచిపెట్టడం ఏ ప్రకారంగా సాధించగలను? ఈ విషయంలో నీవే నాకు ఒక మార్గాన్ని నిర్దేశించవయ్యా! మహాత్మా!

## 28

చ. ఎనసి మనంబుతోడ సక
లేంద్రియముల్ పెడఁబాయఁజాలకే
ఘనముగఁ గర్ణరంధ్రములు
గానముఁ గోరుచునుండుఁ, జర్మమున్
తనరఁగ దూది పానుపులు
తక్కక కోరుచునుండుఁ జూడు! దు
ర్గుణముల కేమనందుఁ? దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనరసింహదేవా! నా యందలి జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలన్నీ మనస్సునే అంటిపెట్టుకొని, ఎడబాయకుండా ఉన్నాయి. ఆ రీతిగా చెవులు ఇంపైన గానాన్ని వినగోరుతున్నాయి; చర్మం మెత్తని స్పర్శగల దూదిపరుపులను కోరుతూ వుంది. తక్కిన ఇంద్రియాలు కూడా ఇలాగే మనస్సును తమ తమ వైపులకు లాగుతూవున్నాయి. ఇక, ఈ ఇంద్రియాల దుర్గుణాలను గూర్చి ఏమని చెప్పగలను? (భక్తవత్సలుడవయిన నీవే వీటిని చక్కబరుపగల మనోనిగ్రహాన్ని ప్రసాదించు ప్రభూ!)

## 29

ఉ. మీఁటిన చక్షురింద్రియము

మేలగు వింతలు చూడఁగోరు, వి

స్తారముగాను జిహ్వా రుచిఁ

సారెకుఁ గోరుచునుండు, నాసికం

బారయ గంధవాసనల

నందముమీఱఁ గ్రహింపఁగోరు; దు

ష్కోరిక లిన్ని చూడు! తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహదేవా! కర్మేంద్రియాలన్నిటిలో మిగుల శక్తిమంతమైన కన్ను మంచిమంచి దృశ్యాలను, వింతలను, విశేషాలను చూడగోరుతూవుంటుంది. అలాగే, నాలుక మంచి మంచి రుచులను (రుచిగల వస్తువులను) మాటి మాటికి కోరుతూనే వుంటుంది. ముక్కు సుగంధ పరిమళాలను అతిశయమైన ఆనందంతో ఆఘ్రాణింపగోరుతూవుంటుంది. ఈ చెడుకోరిక లన్నిటినీ నిగ్రహించే సదుపాయం అనుగ్రహించవయ్యా! వీరనృసింహదేవా!

## 30

ఉ చూడు మహానుభావ! యొక
చోద్యపు జీవుఁడు దేహకాంక్షలన్
వీడఁ, డవెన్ని చెప్పిన వి
వేకము గల్గదు, ఎంత మత్తుఁడో?
రాఁడు దురాశలన్ విడిచి,
ప్రాకృతుభంగిని నింద్రియాలతో
[2]గూడెడఁ బాయలేఁడు; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవైన శ్రీ తరిగొండ లక్ష్మీనరసింహదేవా! మహానుభావా! ఇటుచూడు! విచిత్ర స్వభావంగల ఈ జీవుడు దేహం మీది మమకారాన్ని విడువకున్నాడు. ఎన్ని చెప్పినా, ఎంత చెప్పినా వీనికి వివేకం కలగటం లేదు. నిజంగా వీడు ఎంత మదించినవాడో కదా! దురాశలను విడిచిపెట్టి రానే రాడు. శుద్ధపామరునిలాగా ఇంద్రియాలతో ఎడబాయని రీతిలో కలసిమెలసియుంటున్నాడు. (ఇట్టి అవివేకిని సమర్థుడవైన నీవే సముద్ధరింపగలవు స్వామీ!)

2. 'కూడి+ఎడఁబాయలేఁడు'- అని పద విభాగము.

## 31

ఉ. జోడుగ నెల్ల కాలమును
సొంపుగ నా పరమాత్ముఁడుండు మేల్
జాడఁ గనంగ నేర్చి, తన
జాడకుఁ బోవును జీవుఁ, దన్యథా
జాడకుఁ బోఁదలంచి శివు
జాడకు భీతిల్లుచున్నవాఁడు; ఈ
కోడిగ మేమి చూడు! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహదేవా! తొలుత చాలాకాలంగా ఆ పరమాత్ముడుండే ఉత్తమమైన ప్రదేశాన్ని చూచియున్నవాడై, ఆ మార్గం తెలిసినవాడై వుండి కూడా, ఈ జీవుడు ఇప్పుడు వేరొక మార్గంలో వెళ్లడానికి పూనుకొంటున్నాడు. ఆ పరమేశ్వరుని జాడకు వెళ్లడానికి వీడెందులకో భయపడుతూవున్నాడు. ఈ జీవుని యొక్క ఇప్పటి ఈ కపటమైన ప్రవర్తన యేమిటో? ఎందులకో? నీవే ఆలోచించుమా! స్వామి!

## 32

ఉ. రూఢిగ నాత్మనాయకుని
రూపముఁ గాంచెను నాఁడు వేడుకన్,
గాఢ ప్రపంచమాయలకుఁ
గ్రమ్మఱఁ జిక్కఁదలంచి నేఁడు బల్
మూఢుఁడునై చరింపుచును
మోహమహావనిఁ జిక్కినాఁడయా!
గూఢము నమ్మలేఁడు; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! ఈ జీవుడు ఆనాడు ఆసక్తితో ఆత్మనాయకుడైన పరమేశ్వరుని నిజస్వరూపాన్ని ప్రశస్తంగా దర్శించియున్నాడు. ఈనాడు మళ్లీ బలీయమైన ఈ ప్రపంచ మాయలకు చిక్కదలంచి, మూఢుడై సంచరిస్తూ, 'భ్రాంతి' అనే గొప్ప అడవిలో చిక్కుబడిపోయాడు. ఇలాగ తాను చిక్కుబడిపోయిన ఈ రహస్యాన్ని వీడు విశ్వసింపలేకున్నాడు కదా! ఇక, వీనికి నీవే దిక్కు!

## 33

ఉ. వేడుకతోడ బొందికిని
వింతగఁ జిన్నెలు సేయుచుండఁగా
నేఁడును నింట నుండు, నటు
నిక్కముగా మఱునాఁడు చూచినన్
కాడునఁ జేరి, వేగ లయ
కాలుని చెట్టనుబట్టి, క్రమ్మఱన్
గూడునఁ జేరు జీవి; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! జీవుడు మిగుల ఆసక్తితో ఈ శరీరానికి వింత వింతలైన వన్నెలను, చిన్నెలను ఎన్నిటిని చేసినా, ఈనాడు ఇంటిలో నున్నవాడు మరునాడు కాటికి చేరుకొంటూవుంటాడు. అటుపై యమునితో మైత్రి నెరపి, అనంతరం మరో దేహంలో ప్రవేశిస్తూవుంటాడు. (కావున, అశాశ్వతమైన ఈ బొందికి అతిశయంగా వన్నెలూ, చిన్నెలూ, అలంకారాలూ చెయ్యడం అనావశ్యక మని, వ్యర్థమని సారాంశం).

## 34

ఉ. ఆడకు హంగ పుట్టఁగను
నార్భటమందుచు నింటిలోనఁ బో
రాడుచునుండినంతటను,
నంతకు [3]కింకరు లొచ్చి వేగఁ ద
న్నీడిచి తన్నఁగాను దన
కెవ్వరు నడ్డముగాను రారు; ఆ
గోడెడఁబాప నీవె! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహదేవా! జీవుడు అవసానదశను చేరుకొని ఇంటిలో మృత్యువుతో పోరాడుతూ వుండగా, యముని సేవకులు వచ్చి తనను బలవంతంగా లాగి, తన్నినప్పుడు, తన కెవ్వరూ అడ్డపడలేరు. అలాంటి ఆపత్ సమయంలో ఆ బాధనూ, దుఃఖాన్నీ, నివారించి జీవుణ్ణి ఆదుకొనే సంరక్షకుడవు నీ వొక్కడవే సుమా! (అటువంటి సర్వరక్షకుడవయిన నీకు నా వందనం!)

3 'కింకరులు+వచ్చి' – అని పద విభాగము.

## 35

చ. 'కట కట! జీవి! నీ వికఁను
కష్టము పొందుచు నుండవద్దు, ఈ
ఘటమును నమ్మవద్దు, నినుఁ
గాంచి యఖండముఁ జూడు'మంచు నే
నెటువలె బోధఁ జేసినను,
నెప్పుడుఁ దాను ఘటాభిమానియై
కుటిలము మానఁడాయెఁ; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనరసింహదేవా! 'ఓ జీవీ! నీ వికమీదట కష్టాలు పొందుతూ ఉండవద్దు. ఈ ఘటాన్ని (శరీరాన్ని) సుస్థిరమని ఏ మాత్రం నమ్మవద్దు. నీ అసలు స్వరూపాన్ని గుర్తించి, సత్యమైన ఆ స్వరూపభావనతో అఖండమైన పరమాత్మ తత్త్వాన్ని సందర్శించ'మని నే నెంతగానో బోధచేశాను. అయినా, తానుమాత్రం ఈ ఘటం (శరీరం) నందే అభిమానం కలిగినవాడై, కుటిలమైన నడవడిని మానుకోలేకున్నాడు. (ఇట్టి పరిస్థితిలో ఈ జీవుని సముద్ధరింపగల శక్తిమంతుడవు నీవే కదా? కృపా పరిపూర్ణా!)

## 36

ఉ. కండలు, ప్రేవులున్, బలు వి
కారవుటస్థులు, చీము, నెత్తురున్,
నిండిన మూత్రమున్, మలము
నెప్పుడు మూఁగి, మహా అసహ్యమై
యుండును కుక్షిలోన, నిఁక
నో హరి! యేమని విన్నవింతు? నీ
కుండకు భోగమేల? తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయి తరిగొండలో విలసిల్లుతున్న శ్రీ లక్ష్మీనరసింహదేవా! ఈ శరీరాన్నిగురించి ఏమని విన్నవింపగలను? ఈ కుక్షి (ఉదరం) మాంసపు కండలు, ప్రేవులు, వికారమైన ఎముకలు, చీము, నెత్తురులు, నిండిన మలమూత్రాలు– వీటితో మిక్కిలి అసహ్యంగా ఉంటుంది. అలాంటి ఏహ్యమైన, అశాశ్వతమైన ఈ 'కుండ'కు మితి మీరిన ఐహికసుఖాలు, అలంకారాలు ఎందులకు? (అక్కరలేదని అభిప్రాయం).

## 37

చ. మఱపున జీవుఁ డెప్పటికి

4మాయనుదానికిఁ జిక్కి, తాను నా

యెఱుకను నిల్వనీయకను,

నెప్పుడు మద్గురు వాక్యసంగతుల్

మఱచెదనంచుఁ బోయినను,

మక్కువతోడుత నన్నుఁబ్రోవ స

ద్గురుఁడటు పోవనీఁడు; తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! మాయ అనే దాని చేతిలో చిక్కిన ఈ జీవుడు, నా గురువర్యుడు ఉపదేశించిన వాక్యాలను- జ్ఞానాన్ని ప్రసాదించే వాటిని- ఏమఱు పాటున మరచిపోవడానికి పాల్పడినా గురువర్యుడు నా యెడ వాత్సల్యంతో కూడిన ప్రీతితో, తాను ఉపదేశించిన ఆ వాక్యాలనూ, వాటి ఫలితమైన జ్ఞానాన్నీ మఱువనీయక, నన్నూ, నా యెఱుకనూ అల్లాగే కాపాడుతూవున్నాడు కదా! (నా గురువర్యునికి నాయందు గల వాత్సల్యం అలాంటిది!)

4 'మాయ+అనుదానికి' - అని పద విభాగము.

## 38

ఉ. ఈడిచి తెచ్చి జీవుని మ

హీపతి దండనసేయఁబూని, యా

మూఁడు గుణాలఁ బట్టుకొని

ముప్పిరి పగ్గము పేడి, గట్టిగాఁ

జూడఁగ నార్గురిన్, మదినిఁ

జొన్పిన చిత్తము, నింద్రియంబులన్

కూడ బిగించినాఁడు; తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనరసింహదేవా! అవధరింపుము! ప్రభువైన గురువర్యుడు (గురురాయడు) జీవుణ్ణి సక్రమమైన మార్గంలో నడుచుకొనేట్టు శిక్షింపదలంచిన వాడై, వీణ్ణి తన వద్దకు లాగుకొని వచ్చి, మూడు గుణాలనే ముప్పిరిపగ్గంగా పేని, ఆ త్రాటితో ఆరుగురు శత్రువులను (అరిషడ్ వర్గాన్ని), చిత్తాన్ని మనస్సులోపల దూర్చి, అలా దూర్చిన మనస్సుతో, జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలను (అనగా, ఆ యా ఇంద్రియాల వ్యాపారాలను) కూడా ఒక్కటిగా చేర్చి, గట్టిగా బిగించి యున్నాడు. (ఈ రీతిగా ఈ జీవుణ్ణి సవ్యమైన పద్ధతిలో నెలకొల్పినట్టి గురువర్యుని అనుగ్రహాన్ని కొనియాడుతున్నాను).

## 39

చ. పసగల సామి నన్నెపుడు
పాలనసేయఁదలంచినాఁడొ? నా
కుశలముఁ గోరినాఁడు; నను
గొబ్బున రక్షణచేసి ప్రేమతో,
విసువక, నామనంబు గడు
వింతగుటన్ మదకుంజరాన కం
కుశముగ నిల్చినాఁడు; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహదేవా! సర్వ సమర్థుదయిన నాగురుస్వామి ఏనాడు చక్కగా నన్ను రక్షింపదలచినాడో ఆనాడే నా క్షేమాన్ని మనసారా కోరి, నన్నాదుకొన్నాడు. నాపై కలిగిన అవ్యాజమైన ప్రీతితో, ఎంతమాత్రమూ నన్ను విసుగుకోకుండా, మదపు టేనుగువంటి విచిత్రమైన నా మానసిక ప్రవృత్తిని అటునిటు చెదరి పోనీయకుండా, అంకుశంలాగా స్థిరంగా నిలిచియుండి నన్ను రక్షించాడు. (అటువంటి శక్తిమంతుడైన గురువర్యుని అనుగ్రహాన్ని మిక్కిలిగా కొనియాడుతూవున్నాను).

## 40

ఉ. దేశములోన దివ్యమగు
ధీరుఁడు సర్వము నిండియుండఁగా
వాసి గనంగలేక, మన
వారును, నన్యులటంచు నుండి, [5]వ
ట్టాస లనేటి తీఁగెలను
నప్పుడు [6]నిశ్చయమంచు కత్తితోఁ
గోసెను మద్గురుండు,-తరి
గొండ నృసింహా! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! లోకంలో భగవంతుడనే ధీరాగ్రేసరుడు అంతటా వ్యాపించి యుండగా, ప్రసిద్ధమైన ఈ సత్యాన్ని తెలిసికోలేక, 'వీళ్లు మనవాళ్లు, వాళ్లు పరాయి వాళ్ళు'- అనేటటువంటి భేదభావంతో ఉంటూవుండినాను. అప్పుడు నా గురువర్యుడు నాలోని పలురకాల వ్యర్థమైన ఆశలనే తీగలను దృఢ నిశ్చయమనెడి పదునైన అంచుగల కత్తితో మొదలంట కోసివైచి, నాకు అభేదభావపూర్వకమైన జ్ఞానోదయాన్ని ప్రసాదించాడు కదా!

5 'వట్టి+ఆసలు+అనేటి'- అని పద విభాగము

6 'నిశ్చయము+అంచుకత్తితోన్'- అని పద విభాగము.

## 41

చ. నరహరి! మ్రొక్కి చెప్పెదను
నా నుదుటన్ గల వ్రాలు ప్రేమతో
నరుదుగ నంఘ్రిమూలమున
నంటెను, పూర్వపువ్రాలు దీసి, యా
సరసిజ గర్భు పట్టమున
సాంద్రకటాక్షము నుండఁ బంచె; మ
ద్గురు [7]మహిమేమనందుఁ? దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! ఓ నరహరీ! ఇప్పుడు తమకు ఒకానొక స్వానుభవాన్ని మనవి చేస్తున్నాను; కృపతో చిత్తగించు! గురువర్యుడు నాపై గల అవ్యాజమైన ప్రేమతో, తన పాదంచేత నా నొసటి యందలి బ్రహ్మవ్రాతను (బ్రహ్మలిపిని) తుడిచివేసి, క్రొత్తగా అనుగ్రహ పూర్వకమైన తన వ్రాతను వ్రాసి, నన్ను చరితార్థురాలిని కావించియున్నాడు. ఈ విధంగా నా జీవితంయొక్క భవిష్యత్తునే మార్చివేసిన మదీయ సద్గురువర్యుని మాహాత్మ్యాన్ని ఏమని కొనియాడ గలను? (అటువంటి గురుపుంగవుని ప్రభావాన్ని ప్రశంసింప జాలనని కవయిత్రి యొక్క అభిప్రాయం).

**సూచన:** ఈ కవయిత్రీమతల్లియొక్క అపూర్వమైన ఆధ్యాత్మికాను భూతులలో ఇది యొకటిగా పేర్కొనదగియున్నది.

7 'మహిమ+ఏమని+అందున్'- అని పద విభాగము.

## 42

చ. గురునకు నీ కభేదములు

కోరి పఠించితినంచుఁ జిత్తమం

దరయఁగఁ గోపమున్ వలదు,

అంబుజబాంధవ, సోమనేత్ర! నీ

కరుణను నిన్ను నేను పొడ

గాంచితి; నింకనుమానమేల? మ

ద్గురుఁడవు నీవె కాదె? తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహదేవా! సూర్యచంద్రులే నేత్రాలుగా గలిగిన పరాత్పరా! నాగురువర్యునకు నీకు అభేదాన్ని (ఈ శతకంలో ఆ యా చోట్ల) పాటించినానని నీ మనస్సున కోపింపవలదు. నీ అపారకరుణచేతనే నేను నీ దివ్యస్వరూపాన్ని సందర్శింప గలిగినాను కదా! కావున, నా గురువర్యుడవు నీవే! ఇందులో ఏమీ సందేహం లేదు! ఓ గురుస్వామీ! నీ శిష్యురాలైన నన్ను నీకృపా విశేషంతో కటాక్షించు!

## 43

చ. సతమగు సామి! నిన్నికను
సారెకు నే నెటు పోవనిత్తు? నా
యితముగ నీ పదాబ్జముల
నేర్పడ గట్టిగఁ బట్టి, వేగ శ్రీ
పతి! ఘనభక్తి మార్గమను
పగ్గమునన్ బిగఁబట్టి, నిన్ను నా
కుతికకుఁ గట్టు కొందుఁ; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనరసింహదేవా! ఓ శ్రీపతీ! ఎల్లప్పుడూ నెలకొనియుండే సత్యస్వరూపుడవయిన స్వామీ! ఇక మీదట నిన్ను నానుండి దూరం కానివ్వను. నీ పాదపద్మాలను గట్టిగా పట్టుకొని, వాటిని భక్తిమార్గమనే బలమైన పగ్గపుత్రాటితో బాగుగా ముడివేసి, ఆ త్రాటిద్వారా నిన్ను నా కంఠానికి ముడివేసికొంటాను. ఆ విధంగా నిన్ను నానుండి దూరం కానీయక శ్రద్ధతో కాపాడుకొంటూవుంటాను సుమా!

(ఈ నా ఉపాయాన్ని భక్తవత్సలుడవైన నీవు ఆమోదించి, అనుగ్రహించుమా!)

## 44

ఉ. పన్నగశాయి! నీ మహిమ
భక్తులకెల్లను గానవచ్చె, నీ
సన్నిధి దగ్గఱాయెను, వి
చారము తీరెను, ముక్తి గల్గు నా!
నెన్నఁగ నీదు రూపమును
నీగతి నాదు మనంబులోనఁ గన్
గొన్న విధంబు దోఁచెఁ; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయి తరిగొండలో విలసిల్లుతూవున్న శ్రీలక్ష్మీనృసింహదేవా! భక్తులయిన వారలకు నీ మాహాత్మ్యం చక్కగా గోచరిస్తున్నది. ఆ ప్రకారంగా నీ దివ్యచరణసాన్నిధ్యం నాకు చేరువ అయ్యింది. నా విచారమంతా తొలగిపోయింది. నాకు ముక్తి లభిస్తుందనే నమ్మకం కుదిరింది. నామనోవీథిలో గోచరించిన విధంగానే నీ దివ్య మంగళమూర్తి నాకు సాక్షాత్కరించి, అపూర్వమైన అనుభూతిని ప్రసాదించింది. ఓ శేషశయనా! మీకు నా అభివందనం!

## 45

ఉ. పాటుగ నాత్మదేశమునఁ
బన్నుగ వెన్నెల గాయుచుండు, బల్
ఆటకమైన యేడు ఘన
ఆవరణంబులు నుండు, దానిలో
[8]మేటగు సర్పము న్నొకటి
మేరువుమీఁదను [9]కావలుండు, నీ
కోట విధంబుఁ గంటి; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనరసింహదేవా! ఆత్మ యొక్క దేశంలో ఎప్పుడూ సొంపుగా వెన్నెల కాస్తూవుంటుంది. ఈ దేశంలోనే ఏడు గొప్ప ఆవరణలు నెలకొనివున్నాయి. అందులో శ్రేష్ఠమైన సర్పం ఒకటి మేరువుపైన (అగ్రభాగంలో) కావలికాస్తుంటుంది. ఇటువంటి కోటతీరును నీ దయవల్ల నేను కనుగొన్నాను.

8. 'మేటి+అగు'- అని పద విభాగము
9. కావలి+ఉండు'- అని పద విభాగము

## 46

చ. తొలఁగక మేటి కోటకును
త్రోవలు తొమ్మిది, దానిలోపలన్
బలిమిగ నంచెలంచెలను
పట్టుగ నార్గురు [10]కావలుందు, రా
వల నొక యేడు చిల్కలును
వాసిగఁ బల్కుచునుండు, దానిలోఁ
గొలఁకులు రెండు నుండుఁ; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసాగరుడవై తరిగొండలో విరాజిల్లుతూవున్న శ్రీ లక్ష్మీ నరసింహదేవా! ఈ 'కోట'కు (శరీరానికి) తొమ్మిది త్రోవ లున్నాయి. ఈ కోటయందు ఆ యా అంచెలలో ఆరుగురు బలమైన పట్టుదలతో కావలి కాస్తూవున్నారు. ఈ కావలివాండ్రకు అవల ఏడు చిలుకలు ప్రశస్తంగా పలుకుతున్నాయి. అచ్చట రెండు సరోవరాలు ప్రకాశిస్తూ వున్నాయి.

(కవయిత్రి ఈ పద్యంలో మానవదేహంలోని షట్చక్రాలు మొదలయిన యోగవిద్యా విశేషాలను మర్మకవితా ధోరణిలో వెల్ల డించింది).

10 'కావలి+ఉందురు'– అని పద విభజనము.

## 47

చ. కొలఁకుల మధ్యమందు నొక
కోమలి యున్నది, దానిలోపలన్
సలలిత వహ్నిమండలము,
చంద్ర, దివాకర మండలంబులున్,
అలవడ నాఱు చక్రముల
కావల నందొక సారసంబులోఁ
గులుకుచునుండు హంస; తరి
గొండ నృసింహా! దయాపయోనిధీ!

**భావం:**

దయా సముద్రుడవయి తరిగొండలో విలసిల్లుతున్న శ్రీలక్ష్మీనరసింహదేవా! అవధరించు! రెండు సరస్సుల మధ్య ఒక యువతి నెలకొనివుంది. ఆ కోమలి నడుమ అగ్నిమండలం, దానికి అటునిటు చంద్ర, సూర్యమండలాలు ఉన్నాయి. ఇదిగాక, ఆఱు చక్రాలపైన ఒక పద్మం ఉంది; ఆ పద్మం(సహస్రారకమలం)లో జ్ఞానస్వరూపియైన హంస నిత్యం కులుకుతూవుంటుంది.

## 48

ఉ. గీష్పతి, బ్రహ్మ శేషనుత

కీర్తి విశాల! దయాంతరంగ! యో

పుష్పశరారిమిత్ర! విను

పొందుగ దేహములోన మేటిగాఁ

బుష్పము లేదు నుందు, తన

ముందర నందొక ముక్తిపుష్పమున్

గోష్పదభాతి నుండుఁ దరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయి తరిగొండలో అవతరించియున్న శ్రీ లక్ష్మీ నృసింహదేవా! బృహస్పతి, బ్రహ్మ, ఆదిశేషుడు- వీళ్లచే విశేషంగా కొనియాడబడిన విశాలమైన కీర్తిగలవాడా! పరమ శివునకు మిత్రుడా! ఓ కరుణాంతరంగా! స్వామీ! చిత్తగింపుమా! ఈ దేహంలో ప్రసిద్ధంగా ఏడు పుష్పాలు ఉన్నాయి. వాటికి ముందు - అనగా అన్నింటికి పై భాగాన ముక్తి అనే పుష్పం ఆవు గిట్టంత పరిమితి, ఆకృతి- గలిగి భాసిస్తూవుంటుంది.

## 49

ఉ. భాసురలీల సోఽహమను
భావములన్ నిరతంబు చాల హం
సీ సహితంబుగాను మతి
చేసెను మిత్రుఁ; డిలా, భగీరథీ,
కాశి, గయా, ప్రయాగలును
ఖ్యాతిగ దేహములోన నేర్పడన్,
కోశము లైదు నుండుఁ; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయి తరిగొండలో వెలుగొందుతూవున్న శ్రీలక్ష్మీనృసింహదేవా! కాలస్వరూపుడైన సూర్యభగవానుడు ఉచ్ఛ్వాస నిశ్వాసాలనే హంసలను నిరంతరం చలింపజేయటంద్వారా సోఽహంభావాన్ని విశిష్టంగా సూచించాడు! అట్లే, ఈ దేహంలో భూమిని, గంగను, కాశీ, గయా ప్రయాగ– అనే పుణ్యక్షేత్రాలను పాదుకొల్పి యున్నాడు! ఆ రీతిగానే ఈ దేహంలో అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలనే ఐదుకోశాలూ అమరివున్నాయి.

## 50

చ. అరయఁగఁ జేతనుండును, గ
　　ణాధిపుఁడున్, యమరాజ సంఘమున్,
ఇరవుగ బ్రహ్మ, విష్ణులు, మ
　　హేశుఁడు, రుద్రుఁడు, సర్వలోకముల్
సరసిజ సంభవాండమునఁ
　　జక్కఁగ నుండును, ఆ యజాండమున్
గుఱుతుగ నాత్మ నుండుఁ; దరి
　　గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయి తరిగొండలో విలసిల్లుతూవున్న శ్రీలక్ష్మీనృసింహదేవా! అవధరింపుమా! చైతన్య స్వరూపుడయిన పరమాత్మ, గణాధిపతి, యమధర్మరాజు, త్రిమూర్తులు, సమస్త లోకాలు - బ్రహ్మాండంలో చక్కగా ఉంటున్నాయి. ఆ బ్రహ్మాండమంతా సూక్ష్మాకృతితో ఆత్మలో నెలకొనివుంటుంది! (ఇదే సృష్టి రహస్యం!)

## 51

ఉ. కంఠములోని నాళ మతి
కాంతిగ వెల్గెడి రీతిఁ జూచి, యా
కంఠముమీఁద రెండు బలు
కాటుక కొండల మధ్యమందు శ్రీ
కంఠునిఁ గాంచి, యంత లయ
కాలుని వేగమె ధిక్కరించి, వై
కుంఠముఁ జేరవచ్చుఁ; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయి తరిగొండలో ఆవిర్భవించి యున్న శ్రీలక్ష్మీ నృసింహదేవా! చిత్తగింపుమా! ఈ దేహమందలి జీవుడు కంఠంలో మిగుల కాంతితో వెలుగొందే నాళాన్ని పరికించి, అలాగే ఆ కంఠంమీద నెలకొనివున్న రెండు కాటుకకొండల మధ్యన ప్రకాశిస్తూవున్న పరమేశ్వరుణ్ణి సందర్శించాలి. అలా సందర్శించిన ఆ జీవాత్మ మృత్యువుకు అధిపతియైన యముణ్ణిసైతం వేగంగా ధిక్కరించి, నేరుగా శ్రీవైకుంఠ లోకాన్ని చేరగలడు!

## 52

ఉ. నిష్ఠ లవెన్ని గల్గినను,
నేర్పు నరణ్యమునందుఁ బొందినన్,
కష్టము లెన్ని చేసినను
గ్రమ్మఱ జీవుఁడు పుట్టకుండునే?
అష్టమదంబుల న్నుడిగి,
యాత్మను గాంచినవాఁడు వేగ ను
త్కృష్ట భవాబ్ధి దాఁటుఁ; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! మనుజుడు అరణ్యంలో నివసిస్తూ, నియమనిష్ఠలు మొదలైన వాటిలో ఎంతో గొప్ప నైపుణ్యాన్ని సాధించినా, అంతమాత్రంచేత ఈ జీవుడు మళ్లీ పుట్టకుండా ఉండజాలడు. (పునర్జన్మను పొందకుండా తప్పించుకోలేదని అభిప్రాయం).

కులమదం, రూపమదం, బలమదం, ధనమదం, యౌవనమదం, విద్యామదం, అధికారమదం, తపోమదం- అనే ఎనిమిది రీతుల మదములను పూర్తిగా తొలగించుకొని, ఆత్మయొక్క తత్త్వాన్ని దర్శింపగల్గినటువంటివాడు మాత్రమే సువిశాలమైన ఈ సంసార సాగరాన్ని దాటి, (ఆవలి తీరమైన) మోక్షాన్ని చేరుకోగలడని సారాంశం.

## 53

ఉ. మూఁడు గుణంబులు న్నెఱిఁగి,
ముందటి మార్గముఁ గాంచి గ్రక్కునన్,
మూఁడు శరీరముల్ దెలిసి,
ముమ్మలకోనను జేరి ధీరుఁడై,
మూఁడు ప్రవాహముల్ గలసి
మోదము నొందుచునుండు చోటునన్
కూడిన మోక్షమబ్బుఁ; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహదేవా! వందనములు! జీవుడు సత్త్వము, రజస్సు, తమస్సు- అనే మూడు గుణాలయొక్క స్వరూప, స్వభావాలను తెలిసికొని, ఆ పై అనుసరించ దగిన మార్గాన్ని శీఘ్రంగా దర్శించి, స్థూల, సూక్ష్మ, కారణ శరీరము లనెడి మూడు శరీరాల తత్త్వాలను గుర్తెఱిగి, తొణకని స్థిరచిత్తంతో మిగుల మూలన ఉండే కోనయందు (సహస్రారంలోపల) ప్రవేశించి, ఇడ, పింగళ, సుషుమ్న- అనే మూడు ప్రవాహాలు సంగమించియున్న- సంతోషాన్ని ప్రసాదించే- స్థలాన్ని చేరుకొంటే మోక్షం లభిస్తుంది.

## 54

ఉ. వేషము లెల్ల మాని, సువి
వేకముఁ జెంది, విచారహీనుఁడై,
రోషముఁ జంపి, భావమున
రూఢిగఁ జూచుచునుండు వానికిన్
భూషణమైన యట్టి యొక
పువ్వుల తోఁటకుఁ బశ్చిమాన మేల్
ఘోష వినంగవచ్చుఁ; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనరసింహదేవా! అవధారు! లోకంకొఱకై డాబుసరిగా ధరించే బాహ్య వేషాలన్నీ మానుకొని, సుజ్ఞానాన్ని పొందినవాడై, చింతా విరహితుడై, మనస్సులో పరతత్త్వతేజాన్ని స్పష్టంగా సందర్శిస్తూవుండేవానికి మిక్కిలి అందంగా ప్రకాశిస్తున్న ఒకానొక పూలతోటకు వెనుక భాగంలో చక్కని ధ్వనితో గూడిన నాదం వినబడుతుంది. (శ్రేష్ఠమైన ఆ నాదఘోషయే ముక్తికి ముఖ్యసోపానం కదా? స్వామీ!)

## 55

ఉ. బూడిదఁ బూయనేల? మతి
పొందుగఁ గష్టముఁ జేయనేల? యే
నీడల నుండనొల్లకను
నిండిన యెండల నుండనేటికో?
పోఁడిమిగాను నాత్మ నిటు
పొందుగఁ గాంచినవాని వేడుకన్
కూడును మోక్షకాంత; తరి
గొండ నృసింహా! దయాపయోనిధీ!

**భావం:**

దయా సముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహదేవా! చిత్తగించు! మనుజుడు (మోక్షకాంక్షతో) ఒడలంతా బూడిద పూసికోవడం ఎందుకు? శరీరాన్ని పలుకష్టాల పాలు చెయ్యడం ఎందులకు? నీడపట్టున ఉండటానికి అంగీకరింపక (తపస్సు పేరిట) తీవ్రమైన ఎండల్లో ఉండడం దేనికి? ఆత్మ స్వరూపాన్ని ఇంపార సందర్శించిన వానిని ముక్తి అనే కాంత (తనంతట తానుగ వచ్చి) హాయిగా కలుస్తుంది కదా!

## 56

ఉ. మూఁడు గుణాలు మానకను,

ముందర నుండెడి మూర్తిఁ గానకన్,

బూడిద మేనఁ బూసి, బహు

బూటకముల్ పయినేసి, ధాత్రిపై

వాడక సంచరించుచును

[11]వాసగు వస్తువుఁ గానకుండినన్

కూడదు ముక్తికాంత; తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! స్వామీ! అవధరించు! సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం- అనే త్రిగుణాలలో చిక్కుకొని వుండి, వాటిని అదుపు చేయజాలనందున, ఎదుట గోచరించే (దివ్యమైన) ఆత్మస్వరూపాన్ని కనలేక, ఒళ్లంతా బూడిద పూసికొని, ఆడంబరాన్ని సూచించే బాహ్యావేషాన్ని ధరించి, ఉత్కృష్టమైన ఆత్మతత్త్వాన్ని దర్శింపకుండానే, ఊరక ఈ లోకంలో సంచరిస్తూవుండే బూటకాల రాయుణ్ణి ముక్తికాంత కూడదు (కలిసికొనదు) కదా!

11 'వాసి+అగు'- అని పదవిభాగము.

## 57

ఉ. భూచరుఁడైన నేమి? శివ
పూజలు చేసి యనేక ముద్రలన్
చూచినఁ బుణ్యమేమి? యది
చూడకయుండిన నేమి తక్కువల్?
ఖేచరి ముద్రఁ గాంచి మదిఁ
గిన్నర భావము మానసంబులో
గోచరమైన ముక్తి; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహదేవా! అవధరించు! మనుష్యుడు భూమిమీద తిరుగాడుతూ భూచరుడయి యుండి, శివపూజలు చేస్తూ తాంత్రికమైన అనేక ముద్రావిశేషాలను అనుభవపూర్వకంగా తెలిసికొనియున్నా, అథవా తెలిసికోలేక పోయినప్పటికినీ అందులో ఎక్కువగానీ, తక్కువగానీ యేమీ లేవు! అటుగాక, (రాజయోగానికి సంబంధించిన) ఖేచరీముద్రను ఆచరణాత్మకంగా దర్శించి, మానవాతీతమైన అనుభవాన్ని మనస్సులో సాక్షాత్కరింపజేసికొనగలిగితే అదే నిజంగా ముక్తి అనబడుతుంది. (అదే ముక్తి మార్గానికి దారి తీస్తుందని అభిప్రాయం).

## 58

ఉ. పామర బుద్ధులన్నియును
పగ్గములన్ బిగఁగట్టి, సద్గురు
స్వామినిఁ జేరి, బ్రహ్మమును
చాలఁగఁ గాంచినవాఁడు ధీరుఁడై
వేమఱు ముక్తికాంతను వి
వేకముగాఁ గవగూడు; నన్యథా
కోమలి నంటఁబోఁడు; తరి
గొండ నృసింహా! దయాపయోనిధీ!

**భావము:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనరసింహదేవా! చిత్తగించు! పాప కార్యాలను ప్రేరేపించే ఆలోచనల నన్నింటినీ మనస్సనే బలమైన త్రాటితో బిగియగట్టివైచి, ఉత్తమోత్తముడైన గురువర్యుని సన్నిధిని చేరుకొని, పరబ్రహ్మ కళను దర్శించిన పుణ్యాత్ముడు స్థిరచిత్తంతో గూడిన వివేకం గలవాడై, ముమ్మాటికిని ముక్తికాంతను పొందగలడు. అటువంటి మోక్షకామి, మరల కామియై మానవకాంతను తాకడు.

## 59

చ. సతులను జూచి చూచి మది
సంతసమందుచునుందు రెప్పుడున్,
గతులు గనంగలేరు, నినుఁ
గానఁగ లేరు వివేక హీనులై,
సుతు లిఁక మోక్షమిత్తురని
చూచి, ధనంబు నపేక్ష సేయుచున్
కుతుకము నొందినారు; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! ఈ సామాన్య మానవస్వభావాన్ని చిత్తగించు! (ఈ లోకంలో అనేకులు) తమ భార్యలను నిత్యము చూస్తూ (అటువంటి అందగత్తెలు లభించినందువల్ల తామెంతో ధన్యులయినట్లు భావిస్తూ), సంతోషిస్తూవుంటారు. కాని, భావి పరిస్థితులను ఊహింపజాలరు. అందుచేత, దేవదేవుడవయిన మిమ్ము అసలే దర్శించలేరు. మిమ్ము దర్శించాలనేటటువంటి వివేకం లేనివాళ్లైనందువల్లనే, ఆ సతులకు కలిగిన తమ పుత్రులు తమకు (మోక్షంలాంటి) ఉత్తమ గతులను చేకూరుస్తారని ఎంతో ఆశిస్తూ, ఆ పుత్రుల కొరకు ఆసక్తితో ధనాన్ని సేకరిస్తూ ఆహ్లాదపడుతుంటారు. (కాని, ఆ సతులవల్ల, సుతులవల్ల, ధనాలవల్ల సమకూరే సాంసారిక సౌఖ్యాలు అశాశ్వతమైనవని తెలియనివారై ఉంటారని సారాంశం).

## 60

చ. ఇదియును శాశ్వతంబనుచు
నిల్లును, ముంగిలి చూచి చూచుచున్,
కుదురక కాపురంబులును
కొన్ని దినంబులు సేయుచుండఁగా,
ముదియఁగ, మర్త్యకోటులకు
మోహము, లోభము మీఱీ, జ్ఞానమన్
కుదురు గనంగరాదు; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! అవధరించు! మానవు లనేకులు ఈ సంసారమే (ఐహిక జీవితమే) శాశ్వతమయినదనే భ్రాంతితో, తమ యింటిని, ముంగిటి ప్రదేశాన్ని తరచూ ఆసక్తితో చూస్తూ, కల్పించుకొన్న సంతోషంతో జీవితాలను సాగిస్తూవుండగానే (వృద్ధాప్యం ఆవరింపగా) వృద్ధులైపోతారు. అసంఖ్యాకులయిన అలాంటి మానవులలో ఆదినుండీ మోహం (భ్రాంతి), లోభం (పిసినారితనం) మితిమీఱీ వుంటున్నందువలన, అటువంటివాళ్లకు జ్ఞానమనే ఆధార కేంద్రం (కుదురు) కానబడదు. (కోట్ల కొలది సామాన్య మానవుల జీవితాలు ఇలానే కొనసాగుతూ వుంటాయని తాత్పర్యం).

## 61

ఉ. పుట్టుచు గిట్టుచున్ మఱియు
బోధశరీరునిఁ గాననేరకన్,
వట్టి దురాశలన్ దగిలి,
వారిజగంధుల మీఁది ప్రేమచే
నెట్టన కాపురంబులును
నిక్కమటంచును నమ్మి, యాత్మలో
గుట్టుఁ గనంగలేరు; తరి
గొండ నృసింహా! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహదేవా! మానవులు సాధారణంగా మరల జన్మిస్తూ, మరల మరణిస్తూ (అలాగ, మరల మరల మాతృగర్భంలో ప్రవేశిస్తూ) జ్ఞానస్వరూపుడయిన పరమాత్మను దర్శింప జాలక ఉంటారు. మరేమంటే, వనితలపై వ్యామోహంచేత (ఐహికములైన) ఈ సంసారాలనే నిజమైనవిగా విశ్వసించి యున్నందువల్ల, ఆత్మయొక్క లోగుట్టును (అసలు తత్త్వాన్ని) (ఏమాత్రం) కనలేరు కదా!

## 62

ఉ. కట్టిడి బుద్ధి లేక, మతి
కాపురముల్ సతమంచు నమ్మకన్,
చుట్టిన మోహపాశములఁ
జూరునఁ గోసిన బుద్ధిమంతుఁడున్
పట్టగునట్టి దేశికుని
ప్రాపునఁ జేరి, మనంబు నిల్పి, యా
గుట్టు గనంగనేర్చుఁ; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! ఆలకింపుము! బుద్ధిమంతుడైన మనుజుడు చెడు తలంపులను వీడినవాడై, ఈ సంసారాలు అశాశ్వతాలని యెరింగి, వీటిని నమ్మనివాడై, తనను చుట్టుముట్టిన పలు రకాల ఆకర్షణలనే మోహపాశాలను (వ్యామోహాలనే త్రాళ్లను) (దృఢనిర్ణయమనే) చుఱకత్తితో కోసివేసి, యోగ్యుడయిన (మిక్కిలి తగియున్న) గురువర్యుని సన్నిధిని చేరుకొంటాడు. (ఆ గురుపుంగవుడు ఉపదేశించిన రీతిగా) మనస్సును నిలిపి, ఆ గుట్టును (గూఢమైన ఆ ముక్తి స్థానాన్ని) చక్కగా కనుగొనగలడు.

## 63

ఉ. ఎక్కడి రొక్కయోజనము?
లెక్కడి భాగ్యము? లెక్క డింతులున్?
ఎక్కడి పాఁడి పంటలును?
ఎక్కడి బాంధవు? లెల్ల నాఁటికిన్
తక్కక వృద్ధరూపమును
దాల్చినఁ, బుత్రకు లింటి వాకిటన్
కుక్కలఁ దోలుమంద్రు; తరి
గొండ నృసింహా! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! ఈ లోకరీతిని చిత్తగించు! మానవుడు ఎంతో ధనాన్ని సేకరించియున్నా, సంపదను పెంపొందించియున్నా, స్త్రీలను (భార్యలను) ప్రేమతో పోషించియున్నప్పటికీ, పాడి పంటలను చక్కగా సమకూర్చి యున్నప్పటికీ- ఇలాగ ఐహిక విషయాలను ఎంతగానో చేకూర్చిపెట్టి యుండినా, ముసలి తనం పైబడగానే, కన్నకొడుకులే దయమాలినవారై, తనను 'ఇంటి వాకిట్లో కూర్చొని ఇంటిలోకి కుక్కలను రానీయకుండా తోలవలసిం'దని (కఠినంగా) ఆజ్ఞాపిస్తారు కదా! (కనుక ఈ లోకంలో ఎవ్వరి కెవ్వరు?- అనే యథార్థాన్ని గుర్తించి, ముందే తరణోపాయం ఆలోచించి జాగ్రత్తపడవలసి వుంటుందనే హెచ్చరిక- ఇందలి సారాంశంగా గ్రహింపదగివుంది).

## 64

ఉ. యవ్వనమందు నాథులకు
నింతులు [12]మేలుపచార మేర్పడన్
నివ్వటిలంగఁ జేతురు, త్రి
ణేత్రుని వీడని భక్తి నుందు; రా
యవ్వనమంతఁ బోవ, మఱి
యింతులు నాథుల లెక్కసేయకన్
క్రొవ్విన మాట లంద్రు; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనరసింహదేవా! మహానుభావా! సాధారణంగా ఈ లోకమందలి గృహిణులయొక్క స్వభావాన్ని విన్నవిస్తున్నాను, చిత్తగించు! యౌవనదశలో నున్న యువతులు తమ భర్తలను శివుణ్ణి చూసినంత పూజ్యభావంతో చూస్తూ వారికి భక్తిశ్రద్ధలతో పరిచర్యలు చేస్తూవుంటారు. కాలక్రమేణ ఆ యౌవనం గడచిపోయిన పిదప, ఆ యింతులు గర్వించినవారై, పతులను లక్ష్యపెట్టక, దురుసుగా మాట్లాడుతూవుంటారు. (కనుక, ఇంతులు పతులయెడ ప్రదర్శించే సేవాతత్పరత చాలవరకు తాత్కాలికమైనదే యని గుర్తించి, మనుజుడు ముక్తిలక్ష్యాన్ని మరువక మసలుకోవలెనని సందేశం).

12. 'మేలు+ఉపచారము'- అని పద విభజనము.

## 65

చ. మనుజులు మందబుద్ధిఁ జని
మానవనాథుల నాశ్రయించుచున్
ఒనరఁగఁ దర్కవాదముల
నూరక చేసి, ధనంబుఁ దెచ్చి, యా
తనయుల కంచు గొందులను
దాఁతురు లోభముచేత నేర్పడన్,
గొనకొననీదు ముక్తి; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! దయచేసి ఈ మానవస్వభావాన్ని చిత్తగించు! కొందరు విద్యావంతులయిన మనుజులు బుద్ధిమాంద్యంతో రాజులను ఆశ్రయించి, వాళ్ల సభలలో శాస్త్రవాదాలు సలిపి, ఆ రాజులను మెప్పించి, వాళ్లు బహూకరించిన ధనాన్ని తెచ్చి, (తామనుభవింపక), తమ తనయులకొఱకని యుద్దేశించి, పిసినిగొట్టులై మార్మూల ప్రదేశాల్లో భూమియందు దాచిపెట్టుతుంటారు. అల్లాగ ద్రవ్యంపై దురాశ అనే దుర్గుణం అలాంటి పండితుల్లోకూడా ముక్తిని గూర్చిన ఆలోచనను కలుగనీయదు కదా!

## 66

చ. స్థిరమగు మానసంబునను
శ్రీహరి! నిన్నెపు డాశ్రయించినన్
తఱుఁగక యింట నుండు దివి
జాధిప...........................
.........................................
................................
................................తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహదేవా! దేవతలెల్లరకూ అధిపతియైన దేవాదిదేవా! స్థిరమైన మనస్సుతో ఎవరైనా, ఎప్పుడైనా మిమ్ములను ఆశ్రయిస్తే (శరణంటే) అట్టివారల యింటిలో సమస్త సౌభాగ్యాలు తగ్గిపోక ఎప్పుడూ విలసిల్లుతూ వుంటాయి. (అటువంటి భక్తవత్సలుడవైన మీకు నా ప్రణామం!)

## 67

ఉ. చెండితనంబు మానకను,

చెప్పినమాట గ్రహింపనేరకన్

ఉండెడి భార్యతోఁ దగులు

ఊ...............................

...............................

...............................

...............................తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! గయ్యాళిస్వభావం మానుకోకుండా, భర్త చెప్పిన మాటను పాటింపకుండా వుండే భార్యతోడి సంబంధం (సంసారం) నిష్ప్రయోజనం కదా!

**68**

చ. సరసము, నీతి, సాహసము

జాణతనంబును, మేలిమైననున్

పరమ పతివ్రతాగుణము

..................................

..................................

..................................

..................................తరి

గొండ నృసింహా! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! సరసత్వం, నీతి ప్రవర్తన, సమయోచితమైన సాహస గుణం, తెలివి తేటలు, ఉత్తమమైన పతివ్రతాశీలం– కలిగిన భార్య ఎంతో అదృష్టవంతులకే లభ్యమౌతుందనేది సత్యం!

**69**

ఉ. నీతికి లోనుగాక, పర
నిందలు సేయుచు నెల్లకాలమున్
ఘాతుక బుద్ధి మానకను,
గల్లలు వల్కుచు................
...................................
...............................
..................................తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! నీతిమార్గానికి లోబడి వర్తింపక, పరులను నిందిస్తూ, ఎల్లకాలం ఇతరులకు అపకారం చేయాలనే క్రూరబుద్ధిని విడువక, నోరు తెరిస్తే అబద్ధాలే మాట్లాడుతూవుండే దుర్జనులకు తరణోపాయం ఎక్కడిది? అటువంటి కుజనులను నిగ్రహానుగ్రహసమర్థుడవయిన నీవే సంస్కరింపగలవు!

## 70

ఉ. కల్లరి కేల నిక్కమును?

ఘాతక మర్త్యుని కేల ధర్మమున్?

ప్రల్లరి కేల నీతులును?

పాపశరీరున కేల మోక్షమున్?

..............................

..............................

.................................తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయా సముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! అబద్ధాలాడే స్వభావం గలవానికి సత్యంతో పని లేదు. క్రూరమైన పనులు చేసే అలవాటు గల మనుజునికి ధర్మాచరణతో పని లేదు. పరుషవాక్కులు పలికేవానికి నీతులతో నిమిత్తం లేదు. అలాగే, పాపకర్మలు చేసే వానికి మోక్షచింతన అవసరం లేదు కదా!

## 71

ఉ. ముద్దికిఁ గాటు కేమిటికి?
ముక్కిడిదానికి ముక్కరేల? బల్
గ్రుడ్డుల కేల *చల్వలును?
గుక్కల కేలను చీని పల్లమున్?
..............................
..........................
..............................తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! ముద్దికి కాటుక అవసరం లేదు. ముక్కు లేని వ్యక్తికి ముంగర అనే అలంకారం అక్కర లేదు పుట్టుగ్రుడ్డివారికి చల్లదనాన్ని కలిగించే కళ్ల జోడుయొక్క ఆవశ్యకత లేదు. అలాగే, పట్టుతో నిర్మించిన జీను కుక్కలకు అవసరం లేదు కదా!

*ఇక్కడ 'చెల్వలును'?– అని ఉంటే 'పుట్టుగ్రుడ్డివారికి యువతులతో నిమిత్తంలేదు' అనే అర్థం వెల్లడౌతుంది. అయితే ఇది కేవలం సూచనమాత్రమే గాని, పాఠాంతరం కాదు.

## 72

ఉ. మించుల వంటి భోగములు,

మేఘమువంటిది రాజచిత్తమున్,

మంచు విధంబు..................

..................................

.....................................

..................................

...............................తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! ఇహలోక సౌఖ్యాలు మెఱుపులవలె అస్థిరమైనటువంటివి; రాజుల చిత్తం మేఘంవలె మిగుల చంచలమైనటు వంటిది. సంపదలు మంచుసమూహంవలె కరగి అంతరించిపోయేటటువంటివి.

(కాబట్టి, తెలివిగల మనుజుడు మనుగడ సార్థకమయ్యే మార్గాన్ని గూర్చి ఆలోచించాలి కదా!)

**73**

చ. గరిమను హాని, వృద్ధియును

గానఁగ లేక మదాంధకారుఁడై

పరఁగఁగ దండ కాటవికి

..............................

..............................

..........................

..............................తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! అహంకారం చాలా చెడ్డది కదా!

అహంకారమనే అంధకారం తనను ఆవరించియుండి నందువలననే రాబోయే కీలుమేళ్లను ఊహింపజాలక (రావణుడు సీతాదేవిని అపహరించేందుకై దండకారణ్యానికి బయలుదేరి వెళ్లినాడు కదా!)

(అందువల్లనే తత్ఫలితాన్ని తరువాతి కాలంలో పూర్తిగా అనుభవించినాడు కదా!)

**74**

చ. కలిగిన వారికిన్ కలిమి

గల్గిన వారలు ఈవు లిత్తు; రా

కలిమియ లేనివారు తమ

కల్గినయంతలో................

..................................

...........................

...........................తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయా సముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! చిత్తగింపుము! కలిమి గలవారు కలిమి గల్గినవారలకే దానా లిస్తారు. అదేమీ గొప్ప కార్యంకాదు. కలిమినేని వాళ్లు (పేదవారు) తమకు ఉండినంతలో నిరుపేదలయిన వారికి దానాలు చేస్తే అదే నిజమైన ధర్మాచరణ అవుతుంది కదా!

**75**

చ. బలిమిని రచ్చలోఁ గినిసి

భాగ్యము గల్గినవాఁడు దబ్బఱల్

పలికిన నిక్కమండ్రు, మఱి

భాగ్యముఁ గాననివారు నిక్కమున్

పలికిన దబ్బఱందు, రిటు

వంటిది కల్మి ధరిత్రి మీఁదటన్,

కులమున మిండఁడాయెఁ; దరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! ఇహలోకంలో కలిమికి గల ప్రాముఖ్యాన్ని తమకు విన్నవిస్తున్నాను; కృపతో చిత్తగించు!

సంపద గలవాడు సభలో ప్రవేశించి, గట్టిగా అబద్ధాలు మాట్లాడినా, అవన్నీ నిజాలని ఎల్లరూ వాకొంటారు. మఱి నిఱుపేదయైనవాడు సత్యమే పలికినప్పటికీ, అది అసత్యమని అందరూ ఏకగ్రీవంగా అంటారు. కాబట్టి, ఈ భూమిపై (ఈలోకంలో) కలిమికి ఇంతటి బలిమి నెలకొనివుంది! మొత్తంమీద, ఈ ప్రపంచంలో కలిమి గలవాడే ఉత్తమ కులస్థుడుగా పరిగణింపబడుతూవుంటాడు. (ఇహలోకంలో కలిమికి గల బలిమి ఇంత గొప్పదని తాత్పర్యం).

## 76

చ. కలియుగమందు నిక్కముగఁ

గల్లలు తోఁచె, నిజంబు కల్లలై

బలిమిగఁ దోఁచసాగె, మతి

..............................

..............................సత్

కులము లసత్యమాయెఁ; దరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! కలియుగంయొక్క స్వభావాన్ని, ప్రభావాన్ని కాస్త చిత్తగింపుమా! స్వామీ! ఈ కలికాలంలో అసత్యాలు సత్యాలుగా, సత్యాలు అసత్యాలుగా రూఢిగా గోచరిస్తూవున్నాయి. అంతేగాక, ఈ కలియుగంలో 'ఉత్తమ కులాలు'– అనే మాట (ఉత్తమమైన ఆచరణ లేనందువల్ల) అబద్ధమైపోయింది కదా! (అనగా, అర్థంలేని దయ్యిందని అభిప్రాయం.)

(ఇందులో కలిప్రభావాన్ని సూచించడం కవయిత్రియొక్క ముఖ్యోద్దేశంగా గ్రహించదగివుంది.)

77

ఉ. ధర్మమె శాశ్వతంబనుచుఁ
దప్పక యెన్నుచునుండువాఁడు ఏ
కర్మ విరక్తుఁడై, యొనరఁ
గాను ధరిత్రిని కీర్తిమంతుఁడై,
నిర్మల చిత్తుఁడై యెసఁగి
నీ పదపద్మములందుఁ జేరు; నో
కూర్మ శరీర! స్వామి! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! దేవకార్యార్థమై ఒకప్పుడు కూర్మ శరీరాన్ని ధరించియుండిన ఓ స్వామీ! ధర్మమార్గమే సుస్థిరమైనట్టిదని త్రికరణశుద్ధిగా విశ్వసించి, అలా నడచుకొంటూ వుండే మానవుడు భవబంధాన్ని పెంపొందించే ప్రారబ్ధ కర్మలనుండి త్వరగా విరక్తిని పొందగలడు. అలా విరక్తుడైనవాడు ఈ లోకంలో గొప్ప కీర్తిని గడించి, నిర్మలమయిన మనస్సు గలవాడై, తుదకు ఆ లోకంలో మీ పాదకమలాలను చేరుకుంటాడు. (ధర్మాన్నే నమ్మి చరించేవాడు ఇహంలో కీర్తిని, పరంలో ముక్తిని పొంది ధన్యుడౌతాడనేది సారాంశం).

## 78

చ. సరఁగున నాత్మలోపలను
సద్గురుఁ గాంచినవాఁడు క్రమ్మఱన్
అరుగఁడు దుర్గుణంబులకు,
నందుకు సాదృశ మేనుఁ జెప్పెదన్
మఱి కదళీఫలంబుఁ దగ
మక్కువతోడ భుజించు కీరముల్
కొఱుకునె ముష్టికాయఁ? దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! సద్గురుడవు, జగద్గురుడవు అయిన నిన్ను ఏ మనుష్యుడు తన ఆత్మలో సందర్శిస్తాడో, అటువంటి సుకృతి మళ్లీ చెడుగుణాలవైపు వెళ్లడు. (చెడు గుణాలను చేపట్టడని భావం). ఇందుకు ఒక దృష్టాంతాన్ని తమకు మనవి చేస్తున్నాను; దయతో చిత్తగించు! పరిపక్వమైన అరటిపండ్లను ఆరగించిన రామచిలుకలు ఎక్కడైనా, ఎప్పుడైనా విషముష్టి కాయలను (తినవలెననే కాంక్షతో) కొఱుకుతాయా? (కొఱకనే కొఱకవనేది నిశ్చయం).

## 79

చ. అలరు విధిన్, నిషేధమును
నాత్మకు లే; దిటు లెంచిచూడ, నీ
కలఁకలు మానలేకను వి
కారములైన ప్రపంచమాయచే
బలిమిగఁ జిక్కి, భేదములు
పల్కుటెగాని, మహాత్మ! యాత్మకున్
కులమును, గోత్రమేది? తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! మహాత్మా! లెస్సగా ఆలోచించి చూస్తే, ఆత్మస్వరూపానికి ఫలానా కార్యం చేయదగినది(విధి), ఫలానా పని చేయదగనిది (నిషేధం)- అనే రెండూ లేవు. అయితే, ఈ యాత్మ ప్రపంచానికి సంబంధించిన మాయలో గాఢంగా చిక్కుబడియున్నందువల్లనే ప్రతివ్యక్తినీ కులం, గోత్రం- ఇత్యాదుల ఆధారంతో భిన్న భిన్నంగా పరిగణించటం జరుగుతున్నది గాని, నిజం ఆలోచిస్తే ఈ ఆత్మ కులమూ, గోత్రమూ- అనే ఈ రెండు భేదాలూ లేనిది; ఈ రెండు భేదాలకు అతీతమై ఉండేది కదా?

## 80

ఉ. పుణ్యుఁడయైన సద్గురుని
పూజ [13]నిరంతముఁ జేసి, భక్తిచే
గణ్యము సేయ, కాగురునిఁ
గండలుగాఁ దెగఁగోసి, మోక్షమున్
గణ్యముఁజేసి, ముక్తియను
కాంత వినోదముఁ జూడ, వేఱ షా
డ్గుణ్య మెఱుంగలేఁడు; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! అవధరింపుము! మనుష్యుడు పుణ్యాత్ముడైన ఉత్తమ గురుపుంగవుణ్ణి నిరంతరం శ్రద్ధతో సేవించి, ఆయనయందలి భక్తివలన ఏమాత్రమూ సంకోచింపకుండా, ఆ గురువర్యుని నిజాయితీని నిశితంగా పరిశోధించి, ఆయనయొక్క అనుగ్రహవిశేషంచేత మోక్షమనే యువతి తోడి వినోదాన్ని పడయజాలిన అదృష్టశాలి వేటే షడ్గుణాలకొరకు- అనగా ఐశ్వర్యం, వీర్యం, యశస్సు, శ్రీ, జ్ఞానం, వైరాగ్యం- అనే ఆఱు దివ్య గుణాల కొరకు ఎదురుచూడక, ఆనందమయుడై అలరారుతూవుంటాడు.

13 'నిరంతరము'- అను అర్థంలో ప్రయోగింపబడింది.

## 81

ఉ. వేధ కుసంశయంబులును
వీడి నిజస్థితి నుండి, భక్తిచే
సాధకమైన యా నిగమ
సారములో రుచిఁ జూడలేరు, స
ద్బోధ వినంగలేరు, తమ
బుద్ధొక చోటను నిల్పలేరు, దుష్
క్రోధము మానలేరు; తరి
గొండ నృసింహా! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! ప్రపంచంలో కొంతమంది తమ మనస్సులను పీడిస్తూవున్న అల్ప సందేహాలను విడిచి, నిజస్థితియందు నిమ్మళంగా ఉండలేరు. కనుక, భక్తి భావంతో సాధింపదగిన వేదసారం(తత్త్వజ్ఞానం) యొక్క రుచిని తెలిసికోజాలరు. అలాగే, ఉత్కృష్టమయినటువంటి ఉపదేశాన్నిసైతం వినజాలరు. అట్లే, తమ బుద్ధిని ఒకే చోట కొంచెంసేపైనా నిల్పటానికి అశక్తులై ఉంటారు. వాళ్లు మిక్కిలి చెడుదైన కోపగుణాన్నిమాత్రం నిగ్రహించుకోలేరు. (అటువంటి సంశయాత్ములకు నీ దయ ఒక్కటే శరణ్యం స్వామీ!).

## 82

ఉ. చూపు నిజంబుచేసి యొక
చోటనె చక్కఁగఁ జూడలేరు, కన్
పాపల మధ్యమందుఁ
బరబ్రహ్మకళంతయు నిల్పలేరు, సం
తాపము మానలేరు, నొక
దాఁటుగ నాత్మఁ గనంగలేరు, ఆ
కోపము నిల్పలేరు; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! (కడచిన పద్యంలో పేర్కొన్నవారిలాగానే), మఱికొందఱు మానవులు తమ దృష్టిని ఏకాగ్రంగా కేంద్రీకరించి ఒకే చోట సూటిగా, స్థిరంగా చూడజాలరు; అలాగే, కంటిపాపల నడుమ పరబ్రహ్మకళను చక్కగా ధారణ చెయ్యజాలరు. నిరంతరం తమ మనస్సుల్లో చింతిస్తూ వుండడం మాత్రం మానుకోలేరు. ఉత్సాహవంతులై ఒక ఊపులో తమలోని ఆత్మస్వరూపాన్ని కనుగొనలేరు. తమలోని కోపాన్నిమాత్రం అదుపుచెయ్య జాలనివారై ఉంటారు. (అటువంటి వారలకు నిర్వ్యాజమైన నీ దయయే దిక్కు కదా? దేవా!).

## 83

ఉ. బోధశరీరుఁ జేరి తన
బొందిన నుందు మహాత్ముఁ గాంచి, బల్
సాధుల సేవఁ జేయుచును,
జాలఁగ నింద్రియకాంక్ష మానుచున్,
మాధవు నాత్మ నెన్నుచును
మన్న విభుం డటు మర్త్యకోటిపైఁ
గ్రోధముఁ నిల్పఁబోఁడు; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! సుజ్ఞానియైన గురువర్యుణ్ణి సమీపించి, ఆ మహనీయుని ఉపదేశాన్ని పాటించి, తనలో నెలకొనివున్న ఆత్మ స్వరూపుణ్ణి దర్శించి, అనంతరం లోకంలోని సాధు, సజ్జనుల సేవలు చేస్తూ, సమస్త జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాల కాంక్షలను నిగ్రహించుకొంటూ, భగవానుణ్ణి నిత్యమూ మనస్సులో ధ్యానిస్తూ, సాటి మానవులపై కోపగించుకోనట్టి మనుజుడు సర్వశ్రేష్ఠుడు. (అలాంటి మానవుడు 'జీవన్ముక్తుడు'గా పరిగణింప బడుతుంటాడనేది సారాంశం).

## 84

ఉ. భేదము లేక, సర్వము న
భేదముగాఁ బరిణామపూర్ణుఁడై,
బాధక దేహమందు బహు
భావము దోఁచి సదాస్వరూపుఁడై
మోదముఁ జెందుచుండఁగను,
పొందుగ నా సుధ జీవి యింకఁ గా
కోదరమంత గ్రోలుఁ; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! చిత్తగించు! జీవుడు ఐహికములైన అనేక బాధలతో గూడియున్న ఈ దేహంలో ఉంటూవున్నప్పటికీ, స్వ, పర భేదభావన లేనివాడై, సమస్తం ఆ భగవంతుని స్వరూపంగానే పరిపూర్ణంగా సంభావిస్తూ, సహస్రారం నుండి స్రవించే అమృతాన్ని కుండలినీయోగం ద్వారా పానంచేస్తూ, సదా ఆనందస్వరూపుడై మోక్షసామ్రాజ్యాన్ని చూఱగొంటూ వుంటాడు కదా?

## 85

ఉ. ముట్టని దూరమేఁగి, యట
మూఁడు దినంబులు బైట నుండి, యా
ముట్టెడఁ బాపఁబూని బహు
ముఖ్యతరంబుగ బొంది నీళ్లలోఁ
బట్టుగ ముంచివేసినను,
పన్నుగ దేహికి ముట్టు పోవునే?
గుట్టొకటుండఁగాను, తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! దేహి (వనిత) నెలకొక మాఱు ముట్టైన వెంటనే ఎవ్వరిని తాకకుండా మూడు రోజులు ఇంటికి దూరంగా ఉండి, అనంతరం ఆ ముట్టుదోషాన్ని నివారించుకోవటానికై తన శరీరాన్ని నీళ్లలో పూర్తిగా ముంచి తేల్చి శుభ్రంచేసి నప్పటికీ, బొంది ఉన్నంతకాలం ఈ ముట్టు దేహిని విడిచి దూరంగా పోదు కదా! (కాబట్టి, ఈ ముట్టుదోషాన్నుండి శుచి కావటంలో అతిగా ప్రవర్తించరాదని, ఆర్భాటం పనికిరాదని అభిప్రాయం).

## 86

చ. ఇదివరదాఁక దేహముల
నెన్ని ధరించితి? నెన్ని పోయెనో?
మది నినుఁ బాయనేరకను
మాయను దానికిఁ జిక్కియుంటి, నీ
పదములు నేఁడు గంటి; హరి!
పట్టుగ నా కిటు బ్రహ్మవిద్యలోఁ
గొదవలు సేయకియ్యు! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! ఓ శ్రీహరీ! ఈ నా మనవిని కృపతో చిత్తగించు! నేను ఇంతవరకు ఎన్ని దేహాలను ధరించియుండితినో? (ఎన్ని జన్మము లెత్తితినో?) ఎన్ని జన్మలు గడచిపోయినవో? తెలియదు. ఈ జన్మలో నేను మాయకు చిక్కియున్నప్పటికీ, మనస్సులో నిన్ను విడువకుండా (నీ స్మరణ గలిగి) ఉన్నాను. నేడు నీ పాదపద్మాలను దర్శింపగలిగినాను! కనుక, పరబ్రహ్మకు సంబంధించిన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని నాకు ఏ కొదువ లేకుండా అనుగ్రహించు! (పరబ్రహ్మ విద్యను పరిపూర్ణంగా ప్రసాదించు తండ్రీ!).

## 87

ఉ. మర్కటరాజపాల! నిను
మానసమందుఁ దలంచు పుణ్యముల్
శర్కర, పాలు, వెన్నయును
జాల భుజించిన రీతిఁ దోఁచు; నో
యర్కకులాబ్ధిచంద్ర! బలు
ఆఁకలి దీరును; రాఘవేంద్ర! నా
కోర్కెలు చెల్లెనయ్య! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! వానరాజైన సుగ్రీవుని రక్షించిన స్వామీ! నిన్ను మనస్సున స్మరించినంతనే, ఆ పుణ్యంచేత చక్కెర, వెన్న, పాలు తృప్తిగా భుజించినంతటి సంతోషం కలుగుతున్నది. సూర్యవంశమనే పాలసంద్రానికి పరిపూర్ణచంద్రుడవైన ఓ రాఘవేంద్రా! అలాగ నిన్ను స్మరియించినంతట నా అమితమైన ఆకలి తీరుతున్నది. నా కోరికలన్నీ సఫలమైనాయి! అలాంటి కరుణామయుడవైన నీకు నా ప్రణామాలు!

## 88

ఉ. [14]పాటగు నన్నమున్ విడిచి
పత్రము లెప్పుడు మేయనేల? బల్
ఏటికిఁ గట్ట వేసినను
నెన్ని దినంబులు నిల్చుఁ దోయముల్?
బూటకమంతె కాదె? మఱి
పొందుగ జన్మము లెత్తుటెల్ల నీ
కూటికిఁ గాదె? స్వామి! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! అవధరించు! అనువయిన ఆహారాన్ని విడిచిపెట్టి, మనుజుడు (తపస్సు పేరిట) ఆకులు భక్షించడం దేనికి? నిరంతరం వేగంగా ప్రవహిస్తూవుండే జీవనదికి కట్టను వేస్తే, అలాంటి కట్టవల్ల నీళ్లు ఎన్నాళ్లు నిలిచివుంటాయి? అలాగే, ఆకులు మేయడంకూడా ఒక విధంగా బూటకమైనదే (తాత్కాలికమైనదే) కదా! మఱి ఈ జీవుడు పదే పదే జన్మ లెత్తుతూవుండటం కూడా ఆకూటి కొరకే గదా? స్వామీ! (కాబట్టి, కపటమైన ఆచరణకన్నా, మనస్సును నిలుపడం ముఖ్యమనేది సారాంశం).

14 'పాటి+అగు'– అని పద విభాగము.

## 89

ఉ. భోగము, భాగ్యమున్ గలిగి,
పూర్వము నెవ్వరికైనఁ బ్రేమతోఁ
ద్యాగగుణంబు గల్గియును
దానముసేయఁగ లేని గాసిచేఁ
దాఁకి దరిద్రభూత మటు
తప్పక నేఁటికి వెంట నంటె; నూఁ
కో గతి యెవ్వ?రంద్రు, తరి
గొండ నృసింహా! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! పూర్వజన్మప్రారబ్ధానికి నిదర్శనమైన ఈ సత్యాన్ని దయచేసి చిత్తగించు! మానవుడు వెనుకటి జన్మలో భోగ, భాగ్యాలతో తులతూగుతూ వుండికూడా, త్యాగగుణం లేనందువల్ల, ప్రీతితో (అర్హులైన వారెవ్వరికీ) దానం చెయ్యని పాపంచేత, ఈ జన్మలో ఆ జీవుణ్ణి దారిద్ర్యమనే పిశాచం వెంటనంటడం తప్పదు. అలా దరిద్రుడయిన వాని మొఱను ఆలకించే వాళ్ళుగానీ, వాడు దైన్యంతో విన్నవించే పల్కులను సానుభూతితో ఊకొట్టుతూ వినేవాళ్ళుగానీ ఉండరు కదా! అప్పుడు తన పల్కులను వినేవారు లేరని చింతించి ప్రయోజనం లేదని అభిప్రాయం. (కాబట్టి, మానవుడు తనకున్నంతలో ప్రీతితో దానం చెయ్యడం ద్వారా ఇతరులకు సహాయం చేస్తూ పుణ్యాన్ని సంపాదించవలెనని సందేశం!)

## 90

ఉ. పెట్టిన వారికిన్ మతియుఁ
బెట్టిన యంతయె గల్గు; నేటికిన్
వట్టి దురాశలన్ దగిలి
వాజతనంబున నన్య సంపదల్
గట్టిగఁ జూడఁజాలకను
కచ్చలు సేయును? నోరు నొవ్వఁగాఁ
గొట్టిన బొందరయ్య! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! పరుల సంపదను గాంచి ఓర్వలేని దురాశాపరుణ్ణిగూర్చి యిపుడు చిత్తగించు! స్వామీ! ('పెట్టినవారికి పెట్టినంత మహాదేవ!' అన్నట్లు) పూర్వజన్మలో తాను పెట్టిన దానికి (దానం చేసినదానికి) తగినంత ఫలితమే ఈ జన్మలో లభిస్తున్నదని తెలిసికోజాలక, అసూయాపరుడు ఇతరుల సంపదలను గాంచి సహింపలేక, సంపన్నులతో అనవసరంగా, వృథాగా, గట్టిగా అరుస్తూ, కలహిస్తూవుంటాడు. అటువంటివాని నోరు అలాగ, వ్యర్థంగా అరవడానికి అవతరించిన గుంటలాంటిదికదా! తండ్రీ!

## 91

ఉ. పట్టుగ నీశ్వరుండు తన
పాలిటనుండిపు డిచ్చినంతలోఁ
దిట్టక దీనదేహులను
తేటగ లాలన చేసి, యన్నమున్
పెట్టు వివేకి మానసముఁ
బెంపొనరించుచు నూరకుండినన్,
గుట్టుగ లక్ష్మిఁ బొందుఁ; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! వివేకం గల మానవుడు తనకు భగవంతుడు ప్రసాదించినంతలో అంగవికలురు, అనాథలు, నిరుపేదలు- అయిన దీనజనులను కసరుకొనక, ఆప్యాయతతో లాలిస్తూ వాళ్లకు అన్నం పెడుతుంటాడు. ఆ విధంగా అన్నదానం కొనసాగిస్తూ, తన మనస్సులో ప్రశాంతతను పెంపొందించుకొంటూ, నిమ్మళంగా నివసిస్తుంటాడు. అట్లు నెమ్మదితో అన్నదానం కావించే ఆ సజ్జనుణ్ణి సంపదలకు అధిదేవతయైన శ్రీమహాలక్ష్మి గుట్టుచప్పుడు కాకుండా (ఏలాటి ఆడంబరమూ, ప్రచారమూ లేకుండానే) వచ్చి వరిస్తుంది. (ఆతని యింటిలో నెలకొంటుందని అభిప్రాయం. (దీనులకు నిరాడంబరంగా కావించే అన్నదానానికి ఇంతటి మహిమ కలదని తాత్పర్యం.)

## 92

ఉ. బొందియె శాశ్వతంబనుచు
బోరున రొక్కముఁ గూర్చు లోభినిన్
పొందుగ నూరిలోఁ గినిసి
'భోజుఁడ'వంచును భట్లు వేడినన్,
'ఎందుకు వీరు వచ్చి? రిది
యేమి మహాప్రళయం?' బటంచు బల్
గొందుల దూరునయ్య! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! ఇపుడు లోభియైన మనుజుని స్వభావాన్ని నివేదిస్తున్నాను, చిత్తగించు! లోభివాడు ఈ శరీరమే స్థిరమైనదని విశ్వసించి దండిగా ధనాన్ని సమకూర్చుకొంటాడు. అలాంటి పిసినిగొట్టును కవిత చెప్తూతూ పద్యాల్లో ప్రశంసించే భట్టులు సమీపించి, 'దానగుణంలో మీరు భోజమహా రాజులాంటి వారు!'- అని ప్రార్థింపగా, 'నేను ఊళ్లో ఉండగా కొంపలు మునిగిపోయేంత ప్రళయంలాగా ఇప్పుడే వీళ్లెందుకు దాపురించినా రబ్బా?'- అని అనుకొంటూ వాళ్లకు కనిపించకుండా శీఘ్రంగా సందుల్లో, గొందుల్లో దాగుకొంటాడు. (లోభివాని స్వభావం ఇందులో అత్యంత సహజంగా ఆవిష్కరింపబడింది.)

## 93

ఉ. అంకితమైన కీర్తికిని
నాలయమైనటువంటివాఁడ యా
శంకరుఁ డిచ్చినంతయు వి
చారము సేయక, యేక భక్తితోఁ
బొంకముగాను రచ్చలను
'భోజుఁడ' వంచును బల్కువారికిన్
గొంకక, యీవు లిచ్చుఁ; దరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! అవధరింపుము! చక్కగా పేరుప్రతిష్ఠలు గడించిన ఉత్తముడు అధికంగా తనకు సంప్రాప్తింపజేయలేదే!- అనే ఆలోచన మానుకొని, ఆ పరమేశ్వరుడు తనకు ప్రసాదించిన సంపదతో సంతుష్టుడై, చలించని దైవభక్తితో గూడినవాడై, సభల్లో తనను పొగడేవారి ప్రశంసలకు ఉబ్బిపోక, నిబ్బరంగా, తగినవాళ్లకు తగిన రీతిగా దానధర్మాలు చేస్తూ వుంటాడు. (అలాంటి సహజదానపరుడే సత్యమైన కీర్తికి నిలయమైన వాడని సారాంశం.)

## 94

ఉ. ఎవ్వరు లేరు జీవునికి,

నెవ్వరు శత్రువు? లెవ్వరాప్తులున్?

ఎవ్వరు నిందసేయుదురు?

ఎవ్వరు మెచ్చుదు రెన్ని భంగులన్?

ఎవ్వరియందు సంతతము

నేర్పడ జీవుఁడు నిండియుండుఁ; దాఁ

గ్రొవ్వును, భేదమేల? తరి

గొండ నృసింహా! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీ తరిగొండ లక్ష్మీనరసింహదేవా! చిత్తగింపుము! ఎన్ని రీతుల ఆలోచించి చూచినా, ఈ జీవుడే అందరిలోనూ నిండియున్నాడు గనుక, ఈ జీవునికి ఎవరూ శత్రువులు కారు; ఎవరూ మిత్రులు కారు. అలాగే, ఈ జీవుణ్ణి నిందించేవారుగానీ, ప్రశంసించేవారు గానీ ఎవ్వరూ లేరు. యథార్థ మిదిగా ఉండగా, ఒక్కొక్క మనుష్యుడు "నీవు-నేను"- అనే భేదభావంతో అహంకరించి, సతమతం అవుతూవుండడం దేనికి? (తత్త్వం ఎఱిగిన జ్ఞానికి సర్వం భగవత్ స్వరూపమే కాబట్టి, అలాంటి భేద భావన తగదని తాత్పర్యం.)

**95**

ఉ. పాటిగ నగ్నిసాక్షిగ వి
వాహమయైన పతివ్రతామణిన్
నీటున నొల్లకన్, మిగుల
నేరము లెన్నుచుఁ, గొట్టి తిట్టుచున్,
ధాటిగ నన్యకాంతను ము
దంబున రక్షణచేసి, దానితోఁ
గూటమి పాపహేతు; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! చిత్తగించు! ఈ లోకంలోని మనుష్యుల్లో ఒక్కొక్కడు అగ్నిసాక్షికంగా తాను పరిణయమాడిన పతివ్రతయైన భార్యామణిని అంగీకరింపక, ఆమెపై లేనిపోని నేరాలను, దోషాలను ఆరోపిస్తూ, ఆ నేరాల నెపంతో ఆ ఉత్తమురాలిని అనేకవిధాల తిడుతూ, కొడుతూ ఉంటాడు; అంతకంటె ధీమాగా పరస్త్రీని ఉంచుకొని, సంతోషంగా పోషిస్తూ వుంటాడు. అలా పరకాంతతో కూడివుండటం పాపహేతువు కదా? (అటువంటి పాపాత్ముడు ఆ పాపఫలితాన్ని అనుభవించక తప్పదని హెచ్చరిక!)

## 96

ఉ. తల్లికిఁ గాని బిడ్డలును,
దైవము నెంచని మర్త్యకోటులున్,
చల్లర బుద్ధితోడఁ బర
సుందరిఁ గోరుచునుండు వారలున్
తల్లడమంది నాఁటికినిఁ
దప్పక యా యమధర్మరాజుచేఁ
గొల్లకుఁ బోవువారు; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనరసింహదేవా! ఆలకించు! కని పెంచిన తల్లిని సరిగా చూడని కుమారులూ, భగవద్భక్తిలేక, భగవంతుణ్ణి లక్ష్యపెట్టక జీవించే మానవులూ, పోతరించిన పందులవలె మదించియుండి, కామంతో పరస్త్రీలను సదా కాంక్షిస్తూ వుండేవాళ్లూ– ఒకనాటికి– అనగా, అంత్యదశలో– నరకాధిపతియైన యమధర్మరాజుచేత వాళ్లు చేసిన ఆ యా పాపకార్యాలకు అనుగుణంగా నిర్దాక్షిణ్యంగా శిక్షింపబడుతారు. (తల్లిదండ్రులను ఆదరించడం, దైవాన్ని ఆరాధించడం, పరస్త్రీ వైముఖ్యం– మున్నుగాగల సత్ప్రవర్తనల మూలంగా మనుజుడు పుణ్యాన్ని గడించాలనేది సందేశసారాంశం.)

## 97

ఉ. కాయముమీఁది యాస, తన
కైన జనంబుల మీఁది యాశలన్
మాయని నిశ్చయించి, తన
మానసమందును ముక్తిసాధనో
పాయముఁ జేసి, సద్గురుని
పట్టుగ నమ్మియు, మోహపాశముల్
కోయక ముక్తి రాదు; తరి
గొండనృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహదేవా! ముముక్షువగు వ్యక్తి (మోక్షాన్ని పొందగోరేవాడు) అనుసరించవలసిన ఉత్తమ పంథాను మనవిచేస్తున్నాను; దయచేసి ఆదరంతో చిత్తగించు! మోక్షకాంక్షియైనవాడు శరీరంమీది ఆశను, తనకు సంబంధించిన వారలపై గల ఆశలను- వాటన్నింటిని మాయ అని నిశ్చయించి, తన మనస్సున ముక్తిని సాధించగల సదుపాయాన్ని దృఢంగా ఆలోచించాలి. అలాంటి సుదృఢమైన ఆలోచనతో, ఉత్తముడయిన గురువర్యుని సన్నిధిని చేరుకొని, ఆయనను పరిపూర్ణంగా విశ్వసించాలి. ఆ గురువర్యుని అనుగ్రహవిశేషంచేత కలిగిన జ్ఞానంతో సంసార వ్యామోహమనే బలమైన బంధాలను (త్రాళ్లను) కోసివేస్తేనే ముక్తి చేకూరుతుంది.

## 98

ఉ. ఇట్టి శరీరమందు నదు
లెప్పుడుఁ దీయక పాఱఁగా, మతిన్
పుట్టిన భూమిలోపలఁ ద్రి
మూర్తులు నుండఁగఁ గాననేరకన్,
పట్టుగఁ దీర్థయాత్రలకుఁ
బామరులెల్లను బోయి; యూరకే
గొట్టుపడంగనేల? తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయి తరిగొండలో అవతరించియున్న శ్రీలక్ష్మీనృసింహదేవా! అవధరింపుము! ఈ శరీరంలో నదులు నిరంతరం ప్రవహిస్తూనేవున్నాయి. అలాగే, ఈ 'క్షేత్రం'లో త్రిమూర్తులు సైతం నెలకొనియున్నారు. ఇది తెలియలేని కొందరు పామరులు పట్టుదలతో తీర్థయాత్రలకు వెళ్లి, శ్రమపడుతూవుంటారు. (నిజానికి అలాగ ఆయాస పడనక్కర లేదని అభిప్రాయం.)

## 99

చ. మనసొక శుద్ధి లేక, ఘన
మాయకు లోఁబడియుండి, నీళ్లలో
మునిఁగి, శరీర మున్నదని
పొందుగ నందఱుఁ జూచుచుండఁగాఁ,
గనులటు తేలవేసి, కర
కంజములన్ ముకుళించి, మంత్రముల్
గొనిఁగిన ముక్తి రాదు; తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయి తరిగొండలో విలసిల్లుతూవున్న శ్రీలక్ష్మీనృసింహప్రభూ! మనస్సులో శుద్ధి లేకుండా, మాయకు లోనై, నీళ్లలో మునిగి, నిమీలితనేత్రుడై, చేతులు జోడించి, అందరు తనను చూచే లాగున యాంత్రికంగా మంత్రాలను గొణుగుతూవుంటే ముక్తి రాదు.

(ఇతరుల కొరకై నటించే బాహ్యాచారానికన్నా, మోక్షలబ్ధికి మనశ్శుద్ధి ముఖ్యమని తాత్పర్యం.)

## 100

ఉ. వెన్నయుఁ జేతఁ బట్టుకొని
వేమఱు నేయని కూయనేటికో?
పన్నుగ బొందిలోన ఘన
భక్తిని జీవి జపంబుసేయఁగా,
నెన్నుచు వ్రేళ్ల సారెకును
నేర్పడఁ నెప్పుడు గాఢమంత్రముల్
కొన్ని భజింపనేల? తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

### భావం:

దయాసముద్రుడవై తరిగొండలో విరాజిల్లుతూవున్న శ్రీ లక్ష్మీనృసింహ స్వామీ! చిత్తగింపుము! వెన్నను చేతిలో పెట్టుకొని గూడా "నెయ్యి కావాలె; నెయ్యి కావాలె!"– అని అరవడం దేనికి? (అనగా, అలాగ అరవనక్కరలేదని భావం).

అలాగే, జీవుడు దేహంలో నిరంతరం (ఉచ్ఛ్వాస నిశ్వాసాల రూపేణ) జపం చేస్తూనే వున్నాడు కదా? అలాంటప్పుడు అదే పనిగా చేతివ్రేళ్లు కదలిస్తూ తీవ్రమైన మంత్రాలను పునశ్చరణ చెయ్యడం ఎందుకు? (అవసరం లేదని అభిప్రాయం).

అనగా, ఉచ్ఛ్వాసద్వారా "సః" (సో)– అనే అక్షరాన్నీ, నిశ్వాసద్వారా "హం"– అనే అక్షరాన్నీ ఉచ్చరిస్తూ నిరంతరం (మౌనంగా) జపంచేస్తే చాలునని సారాంశం. దీనికే "హంస" (సోఽహం) మంత్రమని, "అజప"– అని పేర్లు కలవు. ఈ "అజప"ను సాధిస్తే, అంతకు మించింది లేదని యోగవిద్యకు సంబంధించిన గ్రంథాలు వివరిస్తున్నాయి.

(జీవుడు కావించే ఉచ్ఛ్వాస– నిశ్వాస క్రమాన్ని పై రీతిని జపకార్యంగా సమన్వయించుకోగలిగితే చాలునని ఈ కవితా తపస్విని సందేశం!)

## 101

ఉ. ముందటి దోవ గానకను,
మూర్ఖులునై బలు జవ్వనంబునన్
సుందరులైన భామినులఁ
జూచి మనంబు నపేక్షసేయఁగా,
నిందలు సేయుచున్, పరుల
నేరము లెన్నఁగఁ దాము బుద్ధిలోఁ
గుందుచు నుందురయ్య! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవయి తరిగొండలో వెలసియున్న శ్రీలక్ష్మీ నరసింహదేవా! మూర్ఖజనులు కొందరు భవిష్యత్తులో తాము నడుచుకొనదగిన సన్మార్గాన్ని తెలిసికోలేనివారై, సుందరీమణులగు యువతులను గాంచి మనస్సులో కోరుకొంటూవుంటారు. ఆ యువతీ మణులపై నిందలను సృష్టిస్తూవుంటారు. అలాగే ఎల్లవేళలా ఇతరుల దోషాలను ఎన్నడంలోనే కాలం గడపుతూ, మలినబుద్ధులై, మనశ్శాంతి లేనివారై యుంటారు.

(అలాంటి కలుషితబుద్ధులను ఉద్ధరించగల్గిన ఉత్తమ సదుపాయం తరిగొండ లక్ష్మీనృసింహుని యందలి భక్తి ఒక్కటే- అనేది సందేశ సారాంశం).

## 102

ఉ. నిన్ననె కంటి నీ మహిమ

నీరజలోచన! దివ్యతేజ! నీ

సన్నిధి దగ్గఱాయెను, వి

చారము మానెను, ముక్తి కల్గె నౌ!

పన్నుగ నవ్విధంబునను

భావములోపల నీదు మూర్తిఁ గన్

గొన్నదె భాగ్యమయ్య! తరి

గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసముద్రుడవై తరిగొండలో నెలకొనియున్న శ్రీలక్ష్మీ నృసింహదేవా! కమలాక్షా! దివ్యతేజస్స్వరూపా! నిన్ననే నీ మహిమా విశేషాన్ని దర్శించాను. నీ సన్నిధి నాకు దగ్గ రయ్యింది. అందుచేత నా విచారమంతా తొలగిపోయింది. మోక్షం అందుబాటులోకి వచ్చింది. ఈ విధంగా మనస్సులో నీ దివ్యమంగళమూర్తిని కనుగొన గల్గిన నా భాగ్యమే భాగ్యము కదా! స్వామీ!

## 103

చ. ఎలమినిఁ బెంపు, సొంపొదవ
నింజెటి వంశజుఁడైన వేంకటా
చలపతి నామధేయుని ని
జాంగన వెంగమ సత్కవీంద్రు లి
మ్ముల ముదమంద నీ శతక
మున్ రచియించి యొసంగె మీకుఁ, గో
ర్కులు సమకూర్పవయ్య! తరి
గొండ నృసింహ! దయాపయోనిధీ!

**భావం:**

దయాసాగరుడవయి తరిగొండలో నెలకొనియున్న శ్రీలక్ష్మి నరసింహదేవా! ఇంజేటి వంశీయుడైన వేంకటాచలపతియొక్క నిజాంగనయైన వెంగమ్మ సత్కవీంద్రులు సంతోషించే విధంగా ఈ శతకాన్ని రచించి, మీకు సమర్పించింది. ఈ కవయిత్రి కోరికలను (ముక్తిని) కృపతో ఇతోఽధికంగా సమకూర్చుమా! స్వామీ!

## తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



శ్రీ వేంకటేశ్వరుని నివాసమైన తిరుమల ఎన్నో ఏండ్లుగా భక్తులకు పరమ పవిత్ర పుణ్యక్షేత్రం. నిత్యం వేలకొలది భక్తులు తమ శారీరక, మానసిక ఆరోగ్యాలకై ఆ దేవదేవుని ప్రార్థిస్తారు.

మాధవసేవకేకాక మానవసేవకు కూడా దేవస్థానం అంకితమైంది. కుష్టువ్యాధి చికిత్సకేంద్రం. వికలాంగుల చికిత్సా కేంద్రం, అనాథాశ్రమము, ఆసుపత్రి లాంటి కేంద్రాలను దేవస్థానం నడుపుతోంది. ఆధునిక వైద్యసదుపాయాలను అందరికీ అందించాలనే సదుద్దేశ్యంతో శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌ను ప్రారంభించింది. శ్రీవారి ఆశీర్వాద బలంతో ఢిల్లీలోని AIIMS, పాండిచ్చేరిలోని JIPMER, ఛండీఘర్‌లోని PGPMS కు సమానంగా దీనిలో సర్వ సదుపాయాలు కల్పించాలని తీర్మానించింది. దీని ప్రధాన ఉద్దేశం మనందరికి సంపూర్ణ ఆరోగ్యం. ఈ సంస్థ వైద్య సేవలు అందించడమే కాకుండా వైద్యరంగంలో పరిశోధనకు, అభివృద్ధికి అత్యంత ప్రాముఖ్యం ఇస్తోంది. ఈ సౌకర్యాలు, సదుపాయాలు పేదసాదలందరికీ అందాలి. నామమాత్రపు చెల్లింపులకే ఈ సౌకర్యాలు అందరికీ అందించటానికి శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌స్-బాలాజీ ఆరోగ్య వరప్రసాదినీ పథకాన్ని ప్రారంభించింది. ఇది విజయవంతం కావటానికి దయాహృదయులై దాతలందరు ముందుకు రావాలని ప్రార్థిస్తోంది.

[illegible] ❖ ఈ పథకానికి విరాళం ఇచ్చినవారికి క్లాజు (1) సబ్ సెక్షన్ (1) 38 క్రింద పూర్తి ఆదాయపు పన్ను రాయితీ లభిస్తుంది. ❖ వ్యక్తులు, సంస్థలు, పర్మ్‌లు విరాళం ఇవ్వవచ్చు. ❖ లక్ష అంత కన్నా ఎక్కువ మొత్తం ఇచ్చిన దాతల పేర్లు ఆసుపత్రిలోని రిసెప్షన్ వద్ద ప్రముఖంగా ప్రదర్శిస్తారు. ❖ 5 లక్షలు అంతకన్న ఎక్కువ మొత్తం ఇచ్చిన దాతల పేర్లను గదులకు పెడతారు. ❖ 15 లక్షలు విరాళం ఇచ్చిన దాత పేరును ఓ విభాగానికి లేదా ఓ కాంప్లెక్సుకు పెడతారు. ❖ కోటి రూపాయల విరాళం ఇచ్చిన దాతపేరును పి.జి. హాస్టలు విభాగానికి లేదా ఆపరేషను థియేటరుకు లేదా నర్సుల హాస్టలుకు లేదా రోగుల బంధువులు వుండే సత్రాలకు పెడతారు. ❖ 5 కోట్లు అంతకన్న ఎక్కువ విరాళం ఇచ్చిన దాత పేరు శ్రీ వేంకటేశ్వరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌స్‌లో ఓ పరిశోధనాపీఠం ఏర్పాటు చేస్తారు. ❖ దాతలు వాహనం, వైద్యపరికరాలు కూడ విరాళంగా ఇవ్వవచ్చు. మారుమూల ప్రాంతాలలో మెడికలు క్యాంపులు నిర్వహించవచ్చు.

ఓ లక్ష అంతకన్న ఎక్కువ విరాళం ఇచ్చిన వారికి తిరుమలలో లభించే సౌకర్యాలు

❖ శ్రీవారి కొలువులో దాతపేరు గోత్రం చదువుతారు. ❖ సంవత్సరంలో మూడు రోజులు 5 గురికి మించకుండా దాత కుటుంబానికి బ్రేక్ సమయంలో శ్రీవారి దర్శనం, హారతి ఏర్పాటు చేస్తారు. అలాగే సంవత్సరంలో 3 రోజులు 5 గురికి ఉచితంగా వి.ఐ.పి. వసతి లభిస్తుంది. ❖ శ్రీవారి,శ్రీపద్మావతి అమ్మవారి చిత్రంగల బంగారు పూత పూసిన వెండి డాలరు జ్ఞాపికగా ఇస్తారు. ఇతర వివరాలకు ఈ క్రింది వారిని సంప్రదించండి.

కార్యనిర్వహణాధికారి, టి.టి.దేవస్థానములు, తిరుపతి. లేదా డైరక్టరు, స్విమ్స్, తిరుపతి
ఫోన్: 0877-2286131

Published by Sri A P V N Sarma, I A S , Executive Officer
T T Devasthanams and Printed at Sri Parasaraya Press, Sri Vyasasramam